కవిత్వం

# మల్టీ నేషనల్ ముద్దు



కొండేపూడి నిర్మల

కవిత-మల్టీ
9792-8

# మల్టీ నేషనల్ ముద్దు

## (కవితా సంకలనం)

కొండేపూడి నిర్మల

894.82718
నిర్మల - మల్టీ

# మల్టీనేషనల్ ముద్దు

(కవితా సంకలనం)

కొండేపూడి నిర్మల
102, క్లాసిక్ అపార్ట్‌మెంట్స్, శ్రీరాంనగర్ కాలనీ, మెహదీపట్నం,
హైదరాబాద్ ఫోన్ : 3534113

© రచయిత

ముద్రణ : మే 2001, కాపీలు : 1000

ముఖచిత్రం : అక్బర్

వెల : 40/-

ప్రతులకు
నవోదయ బుక్‌హౌస్
ఆర్యసమాజ్ ఎదురుగా, బడేచౌడి, హైదరాబాదు-1
విశాలాంధ్ర బుక్‌హౌస్
బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాదు - 1 మరియు అన్ని బ్రాంచీలలో
దిశ పుస్తక కేంద్రం
1-8-540/2, చిక్కడపల్లి, హైదరాబాదు - 20
ప్రజాశక్తి
చిక్కడపల్లి, హైదరాబాదు - 20.
కంపోజింగ్
ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్
హైదరాబాద్-44 ఫోన్ : 7660000
ప్రచురణ
అనుపమ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
126, శాంతినగర్, హైదరాబాద్, ఫోన్ : 3391364

C - 22296
సుందరయ్య గ్రంథాలయ ట్రస్ట్
ACC No. 97928
గచ్చిబౌలి, హైదరాబాద్ - 500032

# చిన్నమాట

సంచలనాలకూ చమత్కారాలకూ యిది చోటుకాదు.

మనుషుల్లో మానవత్వంకరువైపోయిందని బాధపడేలోపు వస్తుసంస్కృతి కేరింతలు పెడుతూ నెత్తి కెక్కేసింది. వస్తువుల్నే రక్తమాంసాలూ రాగద్వేషాలూ వున్న ఆత్మీయులుగా మభ్యపెట్టుకోడం బహుళజాతికంపెనీలు సృజనాత్మకంగా నేర్పుతున్నాయి. కాబట్టే అమ్మని మరిపించే ఫ్రిజ్‌లూ, అర్ధాంగిని తలపించే బైక్‌లూ,పొత్తిళ్ళలో పాపాయిలాంటి సిమెంటుతట్టలూ మనల్ని బేరం చేస్తున్నా, రావాల్సినంతకోసం ఏమీ రావడంలేదు. ఈ భయంకర వాస్తవంలో యిమిడిన అనేక కోణాలకి శబ్దరూపమే మల్టీనేషనల్ ముద్దు. పరిమిత వస్తువుగల ఒక కవితకి అలవోగ్గా తగిలించిన శీర్షిక యిది. కాన్వాసుని బట్టి కంగాళీని బట్టి ఇవాల్టి పుస్తకానికి సరిగ్గా తూగుతుందని ఎందుచేతనో నాకనిపించింది. 'ముద్దు'లాంటి తాజా అనుభూతిని మల్టీనేషనల్ రాకెట్‌తో హైజాక్ చేస్తున్నందుకు బాధపడే సున్నిత హృదయు లెవరేనా వుంటే క్షమాపణలు. ఈ నిర్ణయం తీసుకునే లోపు జరిగిన తర్జన భర్జనలో ఖర్చయిపోయిన నాళేశ్వరం శంకరం, రామ్మోహన్, ప్రసేన్, తదితర మిత్రులకు, కవితలు అచ్చువేసిన పత్రికలకూ, బొమ్మవేసిన అక్బర్, డిజైన్ చేసిన లేపాక్షి అక్షరాలు పొందుపరచిన ఫాంట్‌లైన్ నిర్మలకు, అనుపమ ప్రింటర్స్ రమణమూర్తి తదితరులకు కృతజ్ఞతలు.

కొండేపూడి నిర్మల

**09.05.2001**

# జాబితా


| | |
|---|---|
| కుట్రదారుడి రచనపేరు నాగరికత | 5 |
| Seasonal Love | 9 |
| మల్టీనేషనల్ ముద్దు | 11 |
| వలసల రాజ్యం | 15 |
| రన్నింగ్ ఎపిసోడ్ | 19 |
| జాడ | 23 |
| డి హ్యూమనైజేషన్ ప్రాజెక్ట్ | 26 |
| దడిగాడు వానసిరా | 29 |
| పంటి బిగువున.... | 32 |
| జీవితం వర్సెస్ ట్రూప్‌బజార్ | 34 |
| కాటిసుంకం | 37 |
| నాన్నల్ని కొనాలి కిలోఎంత? | 43 |
| మీ వాడు సైబర్స్పేస్ కానంటున్నడా? | 46 |
| పురుగులందున పుణ్యపురుగులు వేరయా......! | 50 |
| శబ్ద ప్రపంచం | 52 |
| అలలెప్పుడూ తీరం మీదనే... | 56 |
| చావుడప్పు | 58 |
| శీలంలేని కవిత | 62 |
| ఊపిరాడ్డంలేదు | 64 |
| మీడియా | 68 |
| రిగ్గింగ్ | 72 |
| మేల్ వార్డు నెం. 2 | 75 |
| శుష్కవిలాపం | 78 |
| పాడికిళ్ళవ్యాధి | 80 |
| నాన్నలెప్పుడూ ఇంతేనమ్మా | 83 |
| తల్లిపాల వారోత్సవం | 86 |
| హోమ్‌సిక్ | 88 |
| ఇతడేనటే 'స్నేహితుడే' నటే....! | 91 |
| లేడీస్ ఫింగర్స్ | 93 |
| విడాకులు | 96 |
| నా బాధకి వాచకం లేదు | 99 |

# కుట్రదారుడి రచన పేరు నాగరికత

ఆనకట్ట పొడవునా
పాలమూర్ బాధ విస్తరిస్తూనే వుంటుంది
కళ్ళ కడ్డం పెట్టుకున్న చేతుల వెనక కన్నీటి చెమ్మలా
లాకుల కింద నీటిపాయ
బిక్క చచ్చిన చేపల్తో బాటు పెనుగులాడుతూనే వుంటుంది
కట్టమీద నిలబడి చూస్తున్న వాడికెప్పుడూ
రెండు దృశ్యాలు సహజంగా కనిపిస్తాయి
సహజంగానే ....
ఇటు లోహపు కోరలు దిగిన ఇసుకమేటల దిగుళ్లు
అటు బలిసిన కెరటాల్తో కలల నౌకల్ని కావిలించుకున్న
జల తరంగణి ఉరవళ్ళు
విభజన రేఖ స్పష్టంగానే వుంటుంది
వద్దన్న చోటికి వెళ్ళకుండా ప్రవాహం ఆగిపోవటం
పొమ్మన్న చోటికి పోలోమంటూ చెమట బిందువులు పరిగెత్తడం
ఒక గొప్ప నాగరికతా దృశ్యమైతే
నాగరికతలు మోసి మోసి మోపుకట్టిన జీవితాలకు

దిగులుతప్ప దివాలాతప్ప దేశదిమ్మరితనం తప్ప
కట్టిన తేనెపట్టు కాంట్రాక్టు కొదిలి
కకావికలై పరిగెత్తు తేనెటీగ నిట్టూర్పు తప్ప
కంకరా తారూ సిమెంటిసకలు
కొరుక్కుతిన్న చర్మాలు తప్ప
చెమటింకిన ఆ చర్మాల్ని
కప్పెట్టడానిక్కావలసిన పలుగూపారా తట్టాబుట్టా తప్ప
ఆకలి తీరని పిల్లా జెల్లా ముసలీ ముతకా తప్ప
రాజ్యాంగం మిగిల్చిందేమిటో తెలీదు
శ్రమజీవన సౌందర్యం వాళ్ళపాలిట ఓ వెక్కిరింత మాత్రమే
చెట్టుమీంచి చెట్టుకి ఎగిరేలోపు
కాచుకున్న ఉండేలు దెబ్బ ఒక్కటే నిజం
నీడలు మాత్రమే గోచరించు
తోలుబొమ్మల హాసమొక్కటే నిజం
బొమ్మల కదలికలెప్పుడూ
సూత్రధారుడి మునివేళ్ళ మీద ఆధారపడి వుంటాయి
ఆహార్యమూ వ్యాఖ్యానమూకూడా వాడే చేస్తాడు
నాలుగు గూళ్ళూ పోగు పడితే గాని
చెట్టెక్కిన సర్పానికి పొట్టనిండదని చెప్పాడు
నాలుగూళ్ళు తిరిగితే కాని
ప్రపంచం పోకడ తెలీదని చెబుతాడు
తెరిచిన ఆకలి నోటికి అడ్డంగా
ప్రాజెక్టు వెయ్యడం సులువు
పదిమంది ఆకలి గుంపుకడితే గాని

పదకొండో వాడి నాగరికత బట్టకట్టదు
అంచేత మనుషుల్తో బాటు ఆకల్ని కూడా
బ్రతికించడమే తక్షణ కర్తవ్యం
ఆకలి చావుభయాన్ని జయిస్తుంది.
చావు భయం చావు భయం చెయ్యీ చెయ్యీ కలిపి
దూకమన్న గంగలోకి కళ్ళు మూసుకుని దూకేస్తుంది
గుంపుకట్టిన శ్రమబిందువులు గుసగుసలాడుకోకుండా
ఉచ్చులు తన్నుకుని వల నెగరేసుకుపోకుండా
ఉడుత సేవకు మెచ్చి రాముడిచ్చిన పంగనామాల్లాంటి
దళారిమాటలు మర్చిపోకుండా
గట్టి కాపలా వుంటుంది.
మట్టిని మంత్రించే పాలమూర్ కూలీని
గనుల్లో ఖనిజాల్ని నక్షత్రాలకెక్కించిన పాలమూర్ కూలీని
ఫ్యాక్టరీకి,పవర్‌స్టేషన్‌కి ఊపిరినిచ్చిన పాలమూర్ కూలీని
మాతృభూమికి పరదేశిగా మార్చిందెవరో
పరాజితుడ్ని చేసిందెవరో
పుట్టకముందే కాళ్ళూ చేతులూబేరం పెట్టిందెవరో
పుడుతూనే ఒక జమానత్ సంతకానికి
సాగిల పడేలా చేసిందెవరో
ఆ కుట్రదారుడి రచన పేరు నాగరికత
ఊపిరి మొలకల మీద బరువైన కాంక్రీటు గోడ నాగరికత
నాగరికతంటే నిర్మాణమొక్కటే కాదు
కూడుకుంటున్న ఊపిరిని కూల్చి వెయ్యడం కూడా
నాగరికత చెక్కడమే వృత్తిగా చేసుక్ను వాళ్ళక్కడ

బాకీపడ్డ చెంపదెబ్బల కోసమే పుట్టుకొస్తారు
గుంజకు కట్టేసిన పాలబుగ్గలమీద
పంచాయతీ చెల్లించడానికి పుట్టుకొస్తారు
చెరపట్టిన కంపెనీగాళ్ళకి
చేతులెత్తి నమస్కరించడానికి పుట్టుకొస్తారు
చేతిలో ముద్ద నోటికందకుండా
వాయిదాలు రాస్తున్న చీకటి లెక్కలకోసం పుట్టుకొస్తారు
కళ్ళనిండా దుమ్ముకొట్టిపోతున్న లారీల కడ్డంబడి
కూలి అడుక్కోడానికి పుట్టుకొస్తారు
గుంపుకి చెమటే తప్ప
చెమట తుడుచుకోడానికి రికామీ లేని
కాళ్ళూ చేతులూతప్ప
మెదడుండటం నేరం కదా
పైనుంచి పడినప్పుడో ఇనపముక్కలు గుచ్చుకున్నప్పుడో
సెప్టిక్కయిన అవయవాన్ని పెకిలించినంత సహజంగా
ఆ మెదడు మీద పూచీకత్తును సైతం విలవిల్లాడుతూ కొట్టేస్తాడు
ఆకాశాన్ని నమిలి మింగెయ్యాలనే దళారి ఆశకీ
కట్టుబానిస కన్నీటికీ మధ్య ఆనకట్ట బిగుసుకోదు
కట్టీకట్టని ఆనకట్ట పొడుగునా
పాలమూర్ బాధ విస్తరిస్తూనే వుంటుంది.
కళ్ళకడ్డం పెట్టుకున్న చేతులకింద కన్నీటి చెమ్మలా
లాకుల కింద నీటిపాయ బిక్కచచ్చిన చేపల్తో బాటు
పెనుగులాడుతూనే వుంటుంది

*24.7.95* గవాక్షం, ఆంధ్రప్రభ

# SEASONAL LOVE

అనువదిస్తే తప్ప
నాకల నీకర్థం కాదు
దుబాసీ కావాలి
ఫ్రెంచి ముద్దే తప్ప
పెదవి మీది నిట్టూర్పు నీ కర్థం కాదు
కాలాన్ని దోసిళ్ళతో పట్టి ఆపాలి
రెండు దేశాలు కరుణిస్తే తప్ప
తల్లి చావుకి రాలేని పరాధీనం పెళ్ళికొడకా!
ఐవుడ్ లైక్ టూ మిస్ యూ....
గుడ్‌లుకింగ్, ఫెయిర్, టాల్, ఇన్నోసెంట్ గ్రాడ్యుయేట్
విత్ సోషల్ నేచర్ - దరఖాస్తుల దొంతిలో
నూట పదిమందిని అవమానించి
పదకొండో నంబరైన నా కోసం
ఇంపోర్టెడ్ ప్యాకింగులో
మావూరి రోడ్డంట నీ కారొస్తుంటే
పిల్లల్ని బొమ్మలు చేసి

ఎగుమతికి నుంచున్న
ఔత్సాహిక అమ్మానాన్నలంతా
ఇంటకొక ఆనందభాష్పంతో స్వాగతించారు
నీ నీళ్ళు నువు తాగి
ఆనాడే వాళ్ళను అమర్యాద చేశావు
పుట్టిన గడ్డ మీద కదిలే
గాలీ నీళ్ళూ వికటించిన
ఇంక్యుపేటరు ఇంజినీరూ
భాషను మర్చిపోడానికి
స్పోకెన్ ఎంగిలీష్ క్లాసుల్నీ
బాధను మర్చిపోడానికి
గాలాడని కోకల్నీ నా కొదిలి
ఎటుకేసి పారిపోయావో
ఓ డాక్టర్ ఆఫ్ డాలరు ప్రియా
'ఐమిస్స్‌డ్‌యూ' అంటూ
కావిలించుకుని ఏడవాల్సింది
నిన్నో నన్నో అర్థం కాకుండా వుంది
వీసాలో మీసాలో తక్కువైన కారణంగా
మూడేళ్ళకొక సీజను లెక్క నువ్వొచ్చి పోతుంటే
చావిడిలో బక్కటెద్దు చాటుచాటుగా నవ్వుతుంది
ఎంతయినా అవి మనకంటే చాలా నయం
ప్రేమయినా పేడయినా
స్వేచ్ఛా మాధుర్యంతో యివ్వగలుగుతాయి

*3.1.1996 , ఆదివారం అనుబంధం, ఆంధ్రజ్యోతి*

# మల్టీనేషనల్ ముద్దు

బావున్నానా ప్రియా!
కళ్ళెత్తి చూసినా కనకాబిసేకాల్లేవు
గూడుకట్టిన కాస్మెటిక్ చీకటి కరుగుతుందనే భయం
మనసు చెమ్మగిల్లినప్పుడల్లా
అప్లిక్ ఐబాల్స్ అదే పనిగా జారతాయి
అతుకు పెట్టిన రెప్పల మధ్య

ఆకాశం చీలిక పడుతోంది
మరిగే పాలలో మూతిపెట్టి
ముసిముసిగా ఏడ్చుకునే క్యాట్‌వాక్ స్ఫూర్తిగా
అందాల గారడీ
నాఇంటిల్లిపాదినీ బొమ్మలు చేసింది
అమ్మబొమ్మ, కూతురిబొమ్మ, అమ్మమ్మబొమ్మ
కుక్కపిల్ల బొమ్మ -
ఎవరి కన్ను మూసి తెరిచినా మిస్సిండియా కలలే
ఇండియా మొత్తానికి ఇప్పుడు
మిస్సయి పోడమే ఒక కల
కలలు కంటి పాపల్ని కొరుక్కుతింటున్నాయి
గోడ మూల సాలీళ్ళు రెవలాన్ గూళ్ళు అల్లుతున్నాయి
ఇల్లలుకుతూ ఇల్లలుకుతూ
పేరు మర్చిపోయిన ఈగ పిల్లలా
పార్లరు గూటిలో చిక్కుబడి పోతాను
ఫేస్ ప్యాక్ నిరీక్షణలో బల్లమీద శుక్లపక్షం
ఆవిరయిన ఆశలతో అద్దం ముందు కృష్ణ పక్షం
రోజువారీ చిక్ రోజ్ అద్దకాల మధ్య
సిగ్గు ఏ రంగులో ఉండాలో నా బుగ్గలు మర్చిపోయాయి
పుట్టినప్పటి పోలికలిప్పుడు
ఏ చిలక జోస్యుడూ చెప్పలేడు
రాచపుండు సలపరించినప్పుడల్లా
కళాత్మక రాయబారం చేసే రాజనర్తకి నిట్టూర్పు
మెరిసే బూట్లకీ  మగాడి అండర్‌వేర్లకీ

అదనపు విలువ కింద
మొహాన్ని అద్దెకిచ్చినప్పుడల్లా నాకొస్తుంది
ఫేస్ లిఫ్ట్,బ్రెస్ట్ లిఫ్ట్, హిప్స్ లిఫ్ట్, బ్రెయిన్ లిఫ్ట్
హిట్‌లిస్ట్‌లో పెట్టిన నా అవయవాలన్నిటి మీదా
ఒక దేశం తాలూకు పరువుడేగ రెక్క పరిచింది
పొత్తిళ్ళలో నిద్దరోతున్న
చంటిదాని వొళ్ళు నిమురుతున్నా సరే
కావలసిన కొలతల బెంగ
నాన్ సర్జికల్‌గా కుట్టిపోతుంది
సిలికాన్ ఇంప్లాట్స్ కింద
బిక్క చచ్చిపోయిన గుండెచప్పుడు కంటే హింసగా
మార్కెట్ చౌర్యం అందరి రక్తంలోకి యింకుతోంది
జలపాతమే దూకి వచ్చినా
స్ట్రా కోసం వెతుకులాడే లిప్‌స్టిక్ బెదురు
అల్లుకున్న మన పెదవుల మధ్య వగరుగా
జీవభౌతిక రుచులు దోచే మల్టీ నేషనల్ ముద్దు
మొగ్గల్లోంచి పువ్వు బైటికొచ్చినంత సహజంగా
నోట్లోంచి మాట రావడం మానేసింది
చెమట చర్మం మీదికి రాకుండా
ఫౌండేషన్ క్రీమ్ కాపలా
కంటిచెమ్మ రెప్పకు తెలీకుండా
కప్పుకున్న ఐలాష్ కాపలా
మనసు తొణికిన నవ్వు నడచి రాకుండా
చీల్చిన దానిమ్మ చెక్కలాంటి దంత ప్రదర్శన కాపలా

మూసపోసిన ఈ అందం
నా కివాళ ఏ అనుభవాన్ని ఇవ్వడంలేదు
బింబాన్ని మూసివుంచే ప్రతిబింబ దర్పణం
ఏ కళాభిరుచినీ పట్టివ్వడంలేదు
మనసు తాకని కులుకు కోసం కనుగిలుపు కోసం
సర్జరీ సూదులు పరచిన హింసాతల వేదిక మీద
ఉగ్గబట్టిన సౌందర్యాన్నభినయించే ప్రతి గాయమూ
మారకపు విలువే తప్ప
మరేదీ కాదు
పెడిక్యూర్ అనుకుంటూ
పరాయి మార్కెట్ పాదసేవకు
చేతులిచ్చిన దాసిని నేనే
చెక్కిన అవయవాల సమూహంతో
చుక్కల కెగిసిన దేవేరిని నేనే
డీకంపోజవకుండా రసాయనాలు దట్టించిన
తలక్రిందుల కల ఈజిప్షియన్ మమ్మీని నేనే
పసుపూ గంధం పన్నీటి మడుగుల్లో దూకిన
వెనకటి తరం శారీరక స్పృహ కంటే
అందాల వ్యాపారంకోసం
అందవిహీనమవుతున్న వ్యవస్థకి బానిసగా
ఈ సామాజిక స్పృహే నన్నెక్కువ దగా చేస్తోంది
బావున్నానా ప్రియా కళ్ళెత్తి చూస్తేను కాస్మెటిక్ వర్షాలు

*25.4.1996 , గవాక్షం, ఆంధ్రప్రభ*

# వలసలరాజ్యం

దయచేసి యిటుకేసి ఎవరూ రాకండి
ఎవరూ రాకండి...
రాకండి....
కళ్ళు తెరిచిన పుణ్యభూమికి
కటిక చీకటి బహిర్భూమి
దోపిడీలు కుంభకోణాలూ దాచేందుక్కాదు
మందుపాతర పేల్చేందుక్కాదు
రోజుకొక్కసారయినా దొడ్డికి కూచునే వరం కోసం
పురుగుభయాన్ని, జంతుభయాన్ని, మనిషిభయాన్ని
ప్రాణానికి మానానికి పరువు చెల్లిపోయిన భయాన్ని
మూల్యాలుగా చెల్లిస్తున్నాను
దయచేసి యిటుకేసి ఎవరూ రాకండి
ఆర్జన గురించి మాట్లాడ్డానికి
మాకెన్నాళ్ళు పట్టింది?
విసర్జన గురించిమాట్లాడ్డానికి
యింకెన్ని శతాబ్దాలు పడుతుంది?

కళ్ళ సౌందర్యం వెనక నీళ్ళు చిప్పిల్లే నలకల్నీ
కాళ్ళ సౌందర్యం వెనక కీలు అరిగిన బాధనీ
ఉన్నదున్నట్లు పలకడానికి
ఎన్ని జన్మల ఆక్రోశం సరిపోలుతుంది?
నేనివాళ నిర్లజ్జగా నిస్సిగ్గుగా
ఒక విసర్జనక్రియ గురించే మాట్లాడదల్చుకున్నాను
కావ్య గౌరవం లేని నా జీవ భౌతిక యాతనల్లో
నిరంతరం పంటకరిచే రహస్య దుఃఖానికి
తడబాటు లేకుండా మడత విప్పదల్చుకున్నాను
చెంబెడునీళ్ళు కరువైన రాజస్థాన్ డొంకల్లో
దోసెడు మరుగులేని మురికి ఊహలచూపుల్లో
తుమ్మల వెనకా తుప్పలవెనకా
క్రుంగిన పొద్దుల్లా కూచునివున్న
ఆడసూరీళ్ళను గురించి చెప్పదల్చుకున్నాను
కల్తీ మెతుకుల కారం ముద్దలతో
కణకణలాడే కడుపుల్నీ
కాలం చెల్లిన మందులతో
రెట్టింపయిన రుతుస్రావాల్నీ
కూలి గింజల చాకిరిలో
కుట్లు తెగిన ప్రసూతి గాయాల్నీ
కడుపున కాసిన పిండం కూడా తల్లడిల్లే భంగిమలో
నిండునెల్ల మానాల్నీ
ముళ్ళకంపల చాటున బిగపట్టుకునే బీభత్సానికి
రవ్వంతయినా వెలుగివ్వదల్చుకున్నాను

రేడియం అంకెల్లాంటి రెండు నిలువుకాళ్ళతో
దారీ తెన్నూ లేక నుంచుండిపోయిన
నా అక్కలాంటి చెల్లిలాంటి
పదకొండు గంటల ఈ రాత్రి
నాకున్న కుహనా మర్యాదల్ని విసిరికొట్టి
కడుపు చెరువౌతున్న వాస్తవం ఒక్కటే
ఒడిసిపట్టదల్చుకున్నాను
పావురాల గూళ్ళలాంటి అపార్ట్‌మెంట్ ఆఫీసుల్లో
మగ అవయవాలకు మాత్రమే పనికొచ్చే
యూరోపియన్ శానిటరీ వేర్స్‌కు దడిసి
నీళ్ళు తాగితే మూత్రం వస్తుందనే పాపభీతితో
దాహపు గొంతుకలు మోసుకు తిరిగే నాజాతి నిట్టూర్పు
ఎన్ని తరాల విధ్వంసం తరవాత రికార్డవుతుంది?
బస్ కండక్టర్లుగానూ ట్రాఫిక్ పోలీసులుగానూ
యూనీఫారాలిచ్చి 'వెన్ను తట్టిన' మర్నాటినుంచీ
సర్వీసు పని ఒత్తిడితో బాటు
యూరినేషన్ ఎగొని కూడా
చావుడప్పులా భరించాలని
ఏ రాక్షస పీనల్ కోడ్‌లో రాసి వుంది?
అవసరానికి ముందు మదనమందిరాలుగానూ
ఆత్మజ్ఞానం పొడుచుకొచ్చినప్పుడల్లా తోలు బొక్కలుగానూ
వ్యాఖ్యానించబడే మా నగ్నదేహాలు
దుఃఖం తరగలెత్తినప్పుడూ
కోరిక రగిలించినప్పుడే కాదు

లఘుశంకల్నీ దీర్ఘశంకల్నీ
నియంత్రించడం కోసం కూడా
తలక్రిందులుగా తపస్సు చేస్తాయని
ఏ శరీర శాస్త్రం చెబుతుంది?
శ్వాసక్రియలో వాయుకాలుష్యం
జీర్ణక్రియలో ఆహారకాలుష్యం
విసర్జన క్రియపట్ల అవగాహనా కాలుష్యం
దేశంలో సగం జనాభాని
ఎన్ని వలసలపాలు చేస్తోందో
ఏ నాగరిక రాజ్యాంగం రచిస్తుంది?
పొట్టతిప్పలకు ముందే పౌరసత్వ మొకటి ఏడ్చినప్పుడు
పౌరహక్కుల చిట్టాలో నా విసర్జన హక్కెందుకు చేరదో
పర్యాటక జపానుగానో సింగపూరుగానో
అవతారం ఎత్తనున్న నాదేశం కౌరవసభ లో
గంటకొట్టి అడగదల్చుకున్నాను
మానవజాతి యింత పెరిగాక యింకా
నిషిద్ధ ఫలమనేది వుంటే గింటే
అది మనువుగాడి రక్తబంధువు
మట్టిబుర్రే అయి వుండాలి
తక్షణమే దాన్ని లేడీస్ టాయ్‌లెట్
పునాదిగట్టుగా తీర్చి దిద్దండి

*4.1.1998 , గవాక్షం, ఆంధ్రప్రభ*

మల్టీనేషనల్ ముద్దు

# రన్నింగ్ ఎపిసోడ్

సింకింగ్ ... సింకింగ్... సింకింగ్
డబ్బింగ్ స్టూడియోలో అదేపనిగా వినిపించే ఈ మాట
ఐరనీ కాదు.
అంతా అత్యుత్సాహమే
తెప్పరిల్లడం చాతకాని మనసు
చిత్రంగా వొణుకుతుంది

తెరమీద మరుగుజ్జు బొమ్మ నోట్లో
కళా పరిషత్తు నటుడు
చిన్న మూలుగులా యిమిడిపోతాడు
పలు భాషా సీరియళ్ళను దూదేకుతూ
రచయిత తెలుగు బొంతలు
కుట్టడంలోఅస్తమిస్తాడు
కథాకళి ఆహార్యం కక్కును దొడ్డిని కడిగించే
కుంచెల్ని అమ్మి పెడుతుంది
ప్రజాకవి పళ్ళపొడి డబ్బా మీద
ప్రకటన రాయడానికి
పరిగెత్తుకొస్తాడు

ఎపిసోడ్ పూర్తయినప్పుడల్లా
శవం లేచినంత చిల్లర
కళాత్మక గుగ్గిళ్ళను గుటకేస్తూ
తర్ఫీదయిన ఏడుపుల్నీ, నవ్వుల్నీ, మాటల్నీ
భుజాన వేసుకుని మాటకారులు
స్టూడియో నిండా కిటకిటలాడుతారు
"లాభం లేదు మీ లిప్స్ కలవడమే లేదు
బిజినెస్ బాగా చెయ్యాలి"
డైరక్టరు గద్దించినప్పుడల్లా
రోజు కూలి స్వరచాకిరి నేలజారిన భీతి
నూరుకున్న డైలాగుల వెనక

గుబులు గుబులుగా జిరాడుతుంది
'సింకింగ్‌లో సర్టిఫికెట్ వుంది సార్'
రాజ్యాలు కూలిపోయిన రంగస్థల నటి
సబ్బిళ్ళనీ, టీ పొట్లాన్నీ అభినయించడం కోసం
యాడ్ ఏజెన్సీల ముందు చేతులు నులుముకుంటుంటే
అందులో ఐరనీ ఎవరికీ అందదు
అంతా అత్యుత్సాహమే
సినీ తెరమీద కొట్టుకుపోయిన కుర్ర నటుల శవాలు
కేబుల్ నెట్ మీద అరకొరగా తేలుతాయి
తిప్పికొట్టిన స్క్రీన్ ప్లే కథల జిరాక్సుల్తో
ప్రముఖ చానళ్ళు పళ్ళికిలిస్తుంటే
బాంబు పేలుడులో తెగి పడ్డ అవయవాల్లా
ముక్కలు ముక్కలుగా కనిపించడానికలవాడుపడ్డ
కళాత్మక గుమస్తాలు
మొహాన్నొకచోట, గొంతొకచోటు, చేతులొకచోట
పీస్‌వర్క్ కుదిరినందుకు తబ్బిబ్బవుతారు
కిలో తోళ్ళతోనూ గుజ్జున్న మెదళ్ళతోనూ
ప్రారంభమైన మానవ కబేళాలు
గల్లీకొకటి లెక్క కంపెనీ బోర్డులు తగిలించుకుంటాయి
సాహిత్య వెట్టి ఊరేగినప్పుడల్లా
ప్రేక్షక వెట్టి ఉద్రూతలూగి మరీ చప్పట్లు కొడుతుంది
కళాత్మక విలువల మీద పక్కా వ్యాపారులు క్లాసులు తీస్తారు
నాప్రతిభ నన్ను నిలబెట్టడానికి కాక

పోగొట్టుకోడానికే ఎక్కువ పనికొస్తుంది
కంటికి తెలీకుండా కన్నీళ్ళనీ
కాళ్ళకు తెలీకుండా నడకనీ
కాజేసుకుపోతున్న మెదడు శూన్యవ్యాధి
ప్రాథమిక సమస్యగా మారింది
అందరూ ఉత్సాహంగా నడుస్తూనేఉంటారు
ఐరనీ ఎవరూ పసిగట్టలేరు
కళ కళ కోసం కాదు
కళ ప్రజల కోసం కాదు
కళ వ్యాపారం కోసమైనా కాదు
కళ పరాయీకరణగా బతుకుతోంది
గాయపడినందుకు చిహ్నంగా
పెల్లుబికే కోపాన్ని కూడా
మర్చిపోడంలో వున్న
ఐరనీ ఎవరూ గుర్తించడం లేదు
అంత అత్యుత్సాహమే
ఇప్పుడిక
మొలకి చుట్టిన గోచీ
మన సిగ్గుకి చిహ్నం కాదు
ఫలానా బ్రాండు వస్త్ర విశేషానికి
ఎగ్జిబిషన్ కమ్ సేల్ మాత్రమే

*మార్చి ,2000 ,ఇండియాటుడే*

మల్టీనేషనల్ ముద్దు

# జాడ

ప్రియమైన వీరుడా!
ఎప్పటి దీపాన్నప్పుడు ఆర్పెయ్యడమే
ఇటీవలి దినచర్యగా నేను క్షేమంగానే ఉన్నాను
పొగచూరిన మట్టి ప్రమిద లాంటి పొత్తికడుపు మీద
చేత్తో నిమురుకుంటే పాతి పెట్టిన రక్తపాశాలన్నీ
బతికిపోయి మళ్ళీ కదలాడినట్టని పిస్తాయి
దీపాలే కదా మనిషి జాడకి గుర్తు
నీ ఇంటికి నువ్వొచ్చి పోయిన నేరం దాచేందుకు
నా కంటి దీపం ఆర్పేశాను
కడుపులో దీపం ఆర్పేశాను
అర్పెయ్యడాలూ పూడ్చిపెట్టడాలూ
చేతివృత్తులైన చోట
ఇది ఖాకీల రాజ్యం తప్ప మరోటి అవుతుందా!
రగలడమే జీవితమైన వాడి ఇల్లాలికి కానుకగా
రహస్య ఆర్తనాదం తప్ప మరోటి మిగిలిందా!

ఇంటి చుట్టూ ఉచ్చుపన్నిన పర్మారు పహారాలో
భయంలేని చెలికాడి చరిత్ర చెక్కేందుకే
నేనిప్పుడు సవాలక్ష భయాలు మోస్తున్నాను
"ఏడే..నీరంకుమొగుడేడే...ఎక్కడ దాచావే..."
ఎన్నిసార్లు విన్నా జీర్ణమవని ఇనపగుగ్గిళ్ల భాషతో
ఇంటినీ వొంటినీ
లాఠీ కొసలు సోదా చేస్తాయి
తూపాకీ మడమలు ప్రశ్నిస్తాయి
బూటు నాడాలు కుళ్లబొడుస్తాయి
'లేదు...తెలీదు..రాలేదు..'
దెబ్బకొకటి చొప్పున తెగిపడుతున్న మాటల్లో
ఏ మాట పొట్ట కోసినా మూసలో తీసిన
జవాబే వినిపించాలి
కడుపు నిండా కల్లోల సముద్రాలుండీ
కంట నీరెట్టలేని దుఃఖం
పంటికింద ఏడేడు లోకాలూ పటపటలాడిస్తూ
కంట నిప్పులవని దుఃఖం
నీ లక్ష్యానికీ ప్రేమకీ మధ్య నన్ను ఎరచేసి
వాడు వినోదం చూస్తుంటాడు
ఏ పొద్దు నువ్వొస్తావో
ఎటునుంచి వాళ్ళొస్తారో
కబురు తెచ్చిన పావురం కాస్తా ఏ కొసకి ఎగిరిందో
ఎవరి కంటిలో కూలిందో తోచక

భయోత్పాతాల మధ్య చచ్చిపోతున్నాను
ఊర్పు నిట్టూర్పుల మధ్య నలిగి చచ్చిపోతున్నాను
చచ్చి దొరికిపోయిన నా శవం గాని భయం చచ్చి
నీ జాడ చెబుతుందనే భయంతో చచ్చిపోతున్నాను
ప్రియమైన దుర్మార్గుడా!
బతకడం మానేసినట్టనిపించే
కొన్ని యుగాల తర్వాత
ఎందుకోగాని ఏ మలుపులోనో నువ్వెదురవుతావు
ఏదీ చెప్పకుండానే కనుమరుగవుతావు
పొగబెట్టిన గాలికి చెదిరి
కాచుకున్న కలల పట్టును కన్నులారా వదులుకున్న
వెర్రి తేనెటీగలా నేను కొంపకి చేరుకుంటాను
నిన్ను కౌగిలించుకోవడంతోనే
చిగురించడం నేర్చిన చెట్టు సాక్షిగా
గుండు తాకిని నీ గాయాన్ని
తన గుండెలో ఉగ్గబెట్టిన గుట్ట సాక్షిగా
ఏడ్చినప్పుడు విప్పారే పెదవుల నవ్వుతో
నువ్వున్నంత సేపూ నానిండా వీడ్కోలు తొందరే
తుది ఏదో మొదలు ఏదో తెలీని చూపుల విలవిలతో
దింపుడు కళ్ళం దాకా మన దిక్కులు చీలుతున్న బాధే
ప్రియమైన కామ్రేడ్!
కొన్ని దీపాలు ఆరిపోవడం కోసమే పుడతాయి
కొన్ని రూపాలు చీకటిని చెకుముకి చేస్తానంటూ రేవు దాటి వెడతాయి

*25.8.1996 , గవాక్షం, ఆంధ్రప్రభ*

# డీ హ్యూమనైజేషన్ ప్రాజెక్టు

తలుపులెప్పుడో మూసుకు పోయాయి
మనది క్లోజ్డ్ కల్చర్ ట కదా!
విండోస్ తెరుచుకుంటే చాలు
ఓపెన్ కల్చర్ వరదకట్టి ప్రవహిస్తుంది.
డబ్ల్యు..... డబ్ల్యు ..... డబ్ల్యు
మెయిల్ కొట్టాల్సిన అడ్రస్ యింకా పూర్తికాదు
వర్జిన్ ఎయిటీన్, ప్రెగ్నెంట్ ప్యారడైజ్, బర్నింగ్ బ్యూటీ
నిస్సహాయంగా నిలబడతారు
చేతికి దొరికినట్టనిపిస్తూనే చెప్పకుండా దారి మార్చిన
ఎలకపిల్ల..స్టుపిడ్ మౌస్!!!
ఇది ఏ రాజ్యాంగానికి సంకేతం!?

తత్తరబాటు జుగుప్సగా
జుగుప్స ఆత్మ న్యూనతగా చుట్టూతా కలియజూస్తే
పనిలేని దుఃఖాన్ని పరీక్ష తప్పిన దుఃఖాన్ని
పోర్నోగ్రఫీతో ఓదార్చుకుంటూ పిల్లలే పిల్లలు........
కాబిన్‌కి ఒకరు చొప్పున చూపులేక, చీలికలేని మాటలేక
అష్టావక్ర శిశువుల్లా మూర్ఛనలు పోతూ....
ఇప్పుడసలు పోర్నో అంటే
బట్టలిప్పుకున్న బొమ్మలు కాదు
కుక్క బిస్కెట్ల కోసం దేశ సరిహద్దుల్ని
తాకట్టుపెట్టిన నేతల బయోగ్రఫీ కూడా
ఐ.టి.పెరిగిపోయిన కొద్దీ
అత్యాచారం మనుషులే చేస్తారన్న
అపవాదు పోయింది
మసీదుపక్కనో, గుడి పక్కనో, పూల దుకాణం పక్కనో
సాదా సీదాగా కనిపించే సైబర్ కేఫ్ కెళ్ళి కూచుంటే చాలు
తీరిక వుండాలే కాని తీగ శృంగారం
పల్స్ రేటుమీద పళ్ళికిలిస్తుంది
నాగరికారణ్యంలో రోజు పొడుగునా
డీ హ్యూమనైజేషన్ ప్రాజెక్టు
"సరదాగా" మాట్లాడి పెడుతుంది
మాటంటే పూర్వపు అర్థం చెరిగిపోయింది
నిన్ను నువు అమ్ముకోవడానికో కొనుక్కోవడానికో తప్ప
మాట ప్రయోజనకారి కావడం లేదు
కేరళలో అమ్మపేరు మీద బ్రాందీ షాపు తెరచినట్టు

ఇప్పుడు మాట కూడా ఒక బూతు క్రీడ
మనిషిని అవమానించని శబ్దాల కోసం
మనం నిఘంటువులింకా రాసుకోనేలేదు
మనసు గోడల్ని కూల్చుకోడానికి
మనం సంభాషణ మొదలెట్టనే లేదు
డంపింగ్ ధాన్యాల మధ్య రైతన్నలు మూగబోయి
లాకౌట్ గేట్ల ముందు కార్మికుడు మూగబోయి
కలలూ కళలూ కమ్యూనికేట్ కాక కళాకారుడు మూగబోయి
నిజంగా చింతలు రాల్చినట్టు ఒకర్నొకరు
కుదిపి కుదిపి అయినా సరే మాట్లాడుకోవాల్సిన
సందర్భంలో
మాట ఒకఅశ్లీల చర్యగా మారిపోయింది
జన జీవన స్రవంతిలో మాట తప్ప అన్నీ వున్నాయి
మాట మన కళ్ళముందు ఊబి
మాట మన మెడకి బిగిసిన ఉరి
తలుపులు మూసిన ఒంటరి దిగులు
విండోస్ తెరిచినంత మాత్రాన పోదు
మాటలు కావాలి మనకిప్పుడు
అశ్లీలం కాని
అధికారానికి లొంగని
సూర్యకిరణంలా చుర చుర లాడుతూ
విజయాల కోసం కాక విలువల కోసం
మాట్లాడే వాడు కావాలి

*5.4.2001, అముద్రితం*

# దడిగాడు వానసిరా

ఔను రాసిన వాడొక గాడిదే
పాటల్నీ కన్నీటి చారికల్నీ
బంగారు బిస్కెట్లు చేసి పాయిఖానా గట్టు కింద
పాతిపెట్టడం తెలీని రాతగాడొక దివాలాకోరే
పంటల్నీ, పెదవుల మీద పాటల్నీ
కొల్ల గొట్టడం మరిగిన కాపిటలిస్ట్ కళ్లకి

రాతగాళ్లూ నిలువీతగాళ్లూ ఉన్న పళాన
గాడిదలవడమే కావాలి
గాడిదల గుంపు పెరుగుతున్న కొద్దీ
ఏలిన వారి కళాపోసన ఏడు జతల చేతులతో
వర్థిల్లుతూ వుంటుంది
కథలూ, ఆటపాటలూ, స్క్రీన్‌ప్లే దర్శకత్వాలూ
ఏడుగుర్రాల సవారీ కడుతున్న చోట
గాడిదల రక్తధూళి గాల్లోకి రేగుతుంది
గ్లిసరిన్ నీళ్ల మోతాదుకి తడిసి
హాలు హాలంతా కన్నీటి వాగులు కడుతుంటే
నకిలీ ప్రతిభకి కిర్రెక్కిన వెర్రి జనం
ఉర్రూతలూగి చప్పట్లు కొడుతున్న కొద్దీ
ప్రేక్షకుల వరసలో అసలు గాయకుడి గుండె
కైమా కొట్టినట్టు నలుగుతుంది
పాటంటే ఏమిటి?
నవ్వక ముందే పొడుచుకొచ్చిన
దంతాలూ కోరలూ కాదు కదా
అది మెదడు పొరల వెనక
తవ్విన కొద్దీ బైటపడుతున్న కఠిన శిలాజాలం వెనక
చెమ్మగిల్లిన రక్తపు జీర!
ఉరిపోసిన ఆశా నిరాశల మధ్య
ఊపిరిపోసుకున్న ఉలిపిరి కూన!
ఉప్పుమూటని బేరం చేసినంత తేలిగ్గా
నా పాటనీ, పాటకంటిన ఆత్మనీ

బేరం చేస్తున్నప్పుడు
అమ్ముడవడమో అపాత్రదానమో తప్ప
మూలిగే నక్క లాంటి రాతగాడికి
మరో గత్యంతరమేదీ వుండదు
పాటంటేనే ప్రవాహమైన చోట
ప్రవాహాన్ని మూటకట్టడమూ
మూట మూటకీ కాపీ హక్కు కోరడమూ
మనుషులకే తప్ప గాడిదలకు తెలీదు కదా
గోడ మీద పోస్టర్లనీ గాలికెగిరే సన్మాన పత్రాల్నీ
తెలీక తినేసి జీర్ణం కాక తికమక పెట్టినప్పుడే
చౌరస్తాలో ట్రాఫిక్‌ను జాం చేస్తుంది గాడిద
బలయిపోయిన గాడిదల్ని బానిస గాడిదలే అదిలిస్తాయి
పంటెవరు దోచుకున్నా సరే
బీడు వదలని రైతొక గాడిద
ఫలమెవరి పేరిట చెలామణి అవుతున్నా సరే
పురిట నొప్పి తీస్తున్న తల్లొక గాడిద
పదమెవరు దోచుకున్నా సరే
పాట మానని గాయకుడొక గాడిద
చెల్లని కాసు చేతికిచ్చిన విటుడి నవ్వుతో
వెండి తెరలు వర్ధిల్లుతున్నంత కాలం
మనుషులు గాడిదలవుతూనే వుంటారు
గాడిద కన్నీళ్ల మీద పరిశోధన జరక్కపోవచ్చు
వెనక్కాళ్ళ వడ్డింపు తెలుసని రుజువులున్నాయి

*15.11.1998 , ఆంధ్రజ్యోతి, ఆదివారం*

# పంటి బిగువున....

ఒక్క జత చెప్పుల కోసం
మూగటెద్దు చర్మాన్నంతా వొలిచి పోసినంత
సహజ బీభత్సంగా
రెండు నిమిషాల సుఖం కోసమో
బంధుమిత్రుల ముందు మగతనపు ప్రకటన కోసమో
నా శరీరాన్ని నీ కింద జీవసమాధి చేశావు కదా!
దుగ్ధ పాత్రతో సహా ఆ రోజే చచ్చిపోయాను
చచ్చిన కొద్దీ చర్మానికి ప్రయోజనాలుంటాయనుకుంటా
పరిచయం లేని, స్నేహం లేని, మృదుభావనలేవీ యింకా మొలవని
పేరైనా నోరారా పిలుచుకునేందుకు వీలుచిక్కని
మన ఏడడుగుల చర్మబంధం
ఒకానొక దుర్ముహూర్తాన
కొనుగోళ్ళ అమ్మకాల రవాణా కేకల మధ్య
తలుపుల కిటికీల వెనక దట్టించిన వెగటు హాస్యాల మధ్య
గోడల చుట్టూ అతికించిన చెవుల మధ్య
మానభంగాల మంచం స్ఫూర్తిగా
తత్తరబాటునీ తరుముకొస్తున్న తొక్కిసలాటనీ
ఏ విద్యుత్తూ వెలిగించలేని అజ్ఞానపు చీకటినీ
ఏకపక్ష నిర్ణయంగా ప్రారంభించిన నీ సాహచర్యపు కోతనీ
పంటి బిగువున భరించడమే
ఇల్లాలితనమైన చోట

ముట్టుకుంటె ఝల్లున పలికె భావప్రకంపన తిగ తెగి
వేలాది నవ వధువుల కఠిన వాస్తవ చిత్రంలా
నేను గడ్డకట్టి పోతున్నాను
కదలని కొయ్య దుంగల్లాంటి కాళ్ల మధ్య
అంగప్రవేశం చెయ్యడమొక్కటే
శోభన శృంగారమని నువు నేర్చుకున్న పాఠంతో
ప్రాణ చలనమెప్పుడో చచ్చి
అలలు లేని ఆత్మస్పర్శ లేని రెండు చర్మాల చిరచిరకి
జీవితమంటే యింతేనేమో అన్న దిగులు
జీవన మాధుర్యం యిది కాదేమోనన్న శంక
నాచుపట్టిన కన్నీటి ఒడ్డున దమ్ముకుంటున్న సంధ్య
ఆపుకోలేని అసహనాన్ని హింసగా తర్జుమా చేస్తున్న
మొరటు చేతుల రాత్రి, నాలుగు కాళ్ళ రాత్రి......
భళ్ళుమనబోయే అద్దం పెంకులతో
ఆపాద మస్తకం ముస్తాబయివున్న నేను
వెరసి ఆకాశంలో ఓ సగం
గోడమూలకు విసిరికొట్టిన చీరతో రవికతో
మాగుతున్న మల్లెపూలతో బాటు
భూపతనమౌతున్న నా కలల మీద కన్నీటిని తడిమి చెప్పు
నీ భాషలోనే అడుగుతాను పోనీ
'ఫ్రిజిడిటీ' అంటే రోగమేనా!?
అయితే ఆ రోగక్రిమికి కారణమేమిటి?

(ఎవరికీ చెప్పనని మాట తీసుకున్న లక్ష్మి ప్రసూనకథా!? - కాదు నూటికి ఎనభై శాతం మంది కథ)

*6.11.95, సాహిత్య వేదిక, ఆంధ్రజ్యోతి*

# జీవితం వర్సెస్ ట్రూప్ బజార్

ఒక పింగాణీ అట్ట హాసం
ఒక ప్లాస్టిక్ డబాయింపు
ఒక లోహపు డమ డమ
మనుషుల్ని తరిమికొడుతున్న మార్కెట్లో
మానవ విలువలు తక్కెడలో వున్నాయి
కొంటారా? అమ్ముతారా?
చీటీలు కట్టాల్సిన పనిలేదు
తల తాకట్టు అవసరం లేదు
అభిరుచి, మన్నికల ప్రసక్తే లేదు
స్పాన్సర్రింగ్, చెంచా, కమీషన్‌గిరి చాతుర్యంతో
కుప్పలు పోసిన వస్తువులు

ఇన్‌ఫ్లేషనా? డిఫ్లేషనా?
గదికీ మదికీ గవాక్షాలు మూసుకు పోయాయి
వైశాల్యాన్ని నమిలి మింగడానికి
నానారకాల వస్తుదంతాలున్నాయి
వస్తువు బరువుకి మాట అగాధంలో పడిపోవచ్చు
వస్తువు మోతకి జీవన సంగీతం మూగబోవచ్చు
ఖండాంతరాల దూరం నుంచి పుష్కరానికోసారి
పుట్టింటి కొచ్చిన మా అక్కా చెల్లెళ్ళ మధ్య
తరచుగా దొర్లేవి వస్తువుల గురించిన సంబరాలే
కామశాస్త్రం తెలిసిన మొగుడికంటే
కొనుగోలు తెలిసిన మగాడికి మార్కులు బాగా పడతాయి
అశాంతి అనిపించినప్పుడల్లా ఒక వస్తువు
భద్రత లోపించినప్పుడల్లా ఒక వస్తువు
నైబర్స్ ఎన్వీలుగా రూపెత్తడానికి ముందు ఒక వస్తువు
ఆత్మలింగాల్లా ఇల్లంతా పాతుకుపోయి
నడకను కుంటుపరుస్తాయి
వాయిదా పద్ధతి మీద కొరుకుడు పడ్డ కష్టార్జితానికి
గాయం కనిపించదు విషం మాత్రం నమ్మకంగా దిగుతుంది
సెంకడ్ హ్యాండ్ వస్తువుల మీద సైతం
భావప్రాప్తి సిద్ధించిన కలలే
మనిషి జబ్బు పడినప్పుడు కూడా రానంత బెంగ
వస్తువు రిపేరయినప్పుడు వస్తుంది
కొత్తకోడళ్ళ సజీవ దహనాలకి
కానుకల మీద మోహం తప్ప

కొండేపూడి నిర్మల

కారణమేదయినా వుందా?
పెళ్ళంటే వస్తువుల పరంపర
పండగంటే వస్తువుల సమాహారం
ప్రేమంటే వస్తువుల జాబితా
మరణమంటే వస్తువుల మిగులు
వెరసి జీవితమంటేనే ఒక ట్రూప్‌బజార్
వస్తువుల హోదా లేకుండా
మనుషులమధ్య సంభాషణ సాధ్యంకావడంలేదు
వస్తు సంఖ్య పెంచుతారనే వ్యామోహంతో తప్ప
తల్లులు పిల్లల్ని కనడంలేదు
అయిన వాళ్ళని ఇంట్లోంచి పొమ్మని
మీరింక నోటితో చెప్పక్కర్లేదు
బేరం చేసిన వస్తువులే పొక్కుంటూ వచ్చి
పకడ్బదీగా పొగబెడతాయి
రోజులు తరబడి బూజులు దులిపి కడిగి సర్ది
సగం ఆయుర్దాయం వస్తువు పాదాల కందిస్తాం
ఆకలి వ్యూహాన్ని తట్టుకోలేని అర్భకుడి పాలిట
నెల్ల తరబడి నిర్వహించే స్టేట్ ఎగ్జిబిషన్
ఒక వల్గర్ యాక్ట్ !
తొక్కిసలాటకు రేగిన దుమ్ముతోబాటు
ఆవలించిన అంగళ్ళనీ రెప్పవాల్చి దులుపుకోలేక
కాకవికలైన కళ్ళలో
వస్తువు ఒక పాచిక

*మార్చి ,2000 , ఇండియా ఇన్‌ఫో*

## కాటి సుంకం

సంపేటోడికి సచ్చేటోడు
లోకువగదా అన్నా
వాడట్టనే గునుగుతడు
కాటిసుంకాల కోసం
రైతు కరువు సెయ్యి సాపాడంట!
కొంప కూలిన బతుకు నస్టం
ఆళ్ళిచ్చే ముదనస్టంతో తీరుద్దా
కడుపుల సల్ల కదలనోడి
కతలే యేరుమరి
బూవి పుట్టక ముందునించీ
వున్న తిప్పలే నాయిరి

బండపడిన బాయిల్లా
బతికేదానికి కొత్తనా!
పొదుగు మీది పోరగాల్లని
ఎట్టికి యిడుసుడు కొత్తనా!
ఒక్క పంట సేతికొచ్చినా
సగం అప్పుతిప్పి కొట్టేటోల్లం
పస్తులుండి దేవులాడినా
కరెంటు బిల్లుకి చాతనైత లేదు
ప్రయివేటు ఫైనాన్సోల్లకి
బుక్కినకొద్దీ దుడ్డు
మిత్తికి తెచ్చిన పైసలన్నీ
మన్నుల పాతిపెట్టుడే అయితది
రెక్కలకాడి సెమటేడికి పోతదో
రగతమేడ నీరయితదో
యిత్తు మొలిసినట్టే వుంటది
కాయి గత్తరొచ్చిన బిడ్డలెక్క
కన్నిడవకనే పంటది
పిడికిలంత పత్తికోసం
కొమ్మలన్నీ కుప్పవోసుడే
మేమేమన్న గీమన్నుల
జపాను దేశాన్ని దింపేదానికి
అప్పుజేసినవా?
సొంత యిమానం దింపేదానికి
అప్పుజేసినవా?

దినానికి తట్టెడు గుడ్లు పొదిగే
లబ్బరు పురుగు లెక్క
మీ నల్లకాతా తెల్లకాతా
సల్లగనే ఉండాల
మా అసుంటోల్లు
కురిసే కొంప కప్పుకున్నా జూదమే
బిడ్డకు లగ్గం జేసినా జూదమే
పోరగానికి పీజులకట్టినా జూదమే
గీలావు జూదం పన్ల కోసమేనయ్యా
మేం ఉన్న నేల అమ్ముకుంటం
అమ్ముకుంటానికేం లేకనే
మస్కట్టుల పొరెల్తాం
తిండి పంటకు గిట్టుబాటు లేకనే
సిరిపంటకు దిగినం గదా
మమ్ముల్నీ గోతుల
యిడిసిందెవులు?
జొన్నలు యిత్తినప్పుడైన
గింత గోరమెన్నడూ లేదయ్యా
సంపేటోడు సావులెక్కసెబితే
సచ్చేటోడు సంతలోన జోగడా
సంతకోతలూ సావుకారు లెక్కలూ
కొంపమీని కొచ్చి
తట్టాబుట్టా యిసిరిసిరి కొడతంటే
ఓటడిగి నోడొచ్చిండా

కొండేపూడి నిర్మల

వొరాలిచ్చిన నొడొచ్చిండా
గుడ్డతొడిగిన గడ్డిబొమ్మల్లెక్క
బతకాల్నె అనుకున్నం
సీమలెక్క దోమలెక్క సావడానికి
గీ రైతు జల్మమే ఎత్తాల్నాబాబూ
పీనిగల్ని బొందపెట్టే కాటోడికి
సుంకం సెల్లించినట్టు
ఆళ్ళ తప్పు మేం దాచేటందుకు
సర్కారోడు నష్టం యిస్తాడంట
గీ పీనిగ నష్టాల లెక్క
మా సేటపెయ్యికి సాలవు
మిత్తి బరువుకీ మెతుకు బరువుకీ
సిగ్గుసితికి పోతంటే
మన్ను పిసికి బువ్వతీసే
గీ పిడికిలిసూపి అడిగేటందుకు
పల్లె నుంచి అసెంబ్లీకాడికి
నడిసొచ్చినం
యవసాయం సేసేటోడ్ని
కేడీగాడి లెక్కజూసి
లాటీలతో నూకిన్రు
గిదేమిరాజ్జెవో గిదేమి నాసినవో
నేతలంటే గొడలెనక కుర్సీలెనక
దాగేటోల్లని మాకానాడే తెలవవట్టె
సత్తాలేని సర్కారోడికి

మాలాంటి సన్నాసోడే
లోకువగద అన్నా
మా అడవులల్ల కట్టె మాది కాకపాయె
మా వాగులల్ల ఇసక మాది కాకపాయె
మా మార్కెట్టుల సరుకు మాది కాకపాయె
రైతన్నలు కూల్నాకొడుకుల కిందనన్న
బతుకనివ్వకుండ
గదేందో గడ్డితొక్కే మిసన్లు తెవ్వాలని
దొరలంత పెద్దసింత సేపట్టిన్రు
మడుసులకు మన్నుసాలని దిబ్బలో
రైతేం జేసుడు? పసులేంజేసుడు?
దున్నటానికి మోసేకాడితో
సావుగుంట తవ్విండో
ఎలుగు కోసం ముట్టిన దీపం
కొరివి మంట జేసిండో
ఎన్నొద్దుల మనసు రాయి జేసుకు
నడిచిండో నా పెనిమిటి
ముందుమాటలేదు సివరి మాటలేదు
అయ్యలేని గీ బిడ్డల మీ దొట్టు
ఆగమాగమై వున్నోడికి
డొడ్డసింత వచ్చుద్దా
సేనుల్ల పురుగుపాకి
బతుకులల్ల పురుగుమందు పాకి
మడిసీ మడిసెక్కా ఒక్క తీరున సచ్చిపోతే

కన్నొల్లకి కట్టుకున్నదానికి
కడుపు సెరువైనగోస
గా దళారోడు ఎంగిలి జేసిన
కాటిసుంకంతో తీరుద్దా
సంపేటోడికి సచ్చేటోడు
లోకువగద అన్నా
వాడట్టనే గునుగుతాడు
ఎన్ని మందుల సల్లినా
సేనుకొరికే పురుగు బతుకుతాంది
ఎన్ని ఎలచ్చన్లు మారినా
దేశం కొరికే సర్కారు బతుకుతాంది
సచ్చిసెడి బతకాల్నే
బతికిసెడి సావాల్నే
గీ గొనుగుడు గొనిగే
కతర్ నా కొడుకుల
ఇజ్జత్తు మీన దెబ్బకొట్టి
అడగాల్సిందెవురు?
బక్కరైతూ, బుగ్గిసేనూ
సచ్చేడిదే నేరమైతే
సంపేటోడికి సిచ్చేమిటి?
బతికేడిదే బారమైతే
బరువుమోసే బుజమేడిది?

*3.3.1998,* చూపు

# నాన్నల్ని కొనాలి కిలొ ఎంత?

రొట్టెలకు రేటుంది
చూపులకు చులకనవుతూ గాలికెగిరే మా బట్టలకు రేటుంది
నాన్నలు కావాలి కిలో ఎంత?
అమ్మ వొంటిమీద కదుముకట్టిన గాయాల్లో
నాన్న చేసింది ఎన్నో గాయమైనా
గాయాలమీద రేపు వాలబోయే ఈగల్లో
నాన్న ఉనికి ఎన్నో క్రిమి అయినా
నమ్మి నమ్మి నమ్మకాలన్నీ వట్టిపోయిన మా వాడకి
నాన్నతనం ఎన్నో అబద్ధమైనా
బడికెళ్ళికాసిని అక్షరాలు నేర్చుకునేందుకు
నాన్నల్ని చూపాలి కిలో ఎంత?

చెట్టంతటి మా అమ్మని కొమ్మలు రాల్చి
వట్టి కట్టెలా మంచాల మీద చీలుస్తున్నప్పుడు
తలుపుకివతల నిస్ప్రాణగా దొర్లిన నా బాల్యానికి
ఎవరో మప్పిన నల్లమందు రుచి నాన్న ఇచ్చింది కాదు
ఒడ్డున పడేసిన ఓటి పడవలా
పొద్దంతా నిద్దరోయే అమ్మ డొక్కలో తల దూర్చి
రాత్రవకూడదని నే చేసే ప్రార్థనకి నాన్న పీడ పోదు
పదేళ్ళకే పైట జార్చి కన్ను కొట్టడం నేర్పిన మా ఆకలికి
నాన్న రాజముద్ర అక్కర్లేదు
బడికెళ్ళి నాలుగు అంకెలు నేర్చుకునేందుకు
నాన్నల్ని తేవాలి కిలో ఎంత?

తన్నుకుంటూ తార్చుకుంటూ ఈ దందాలో చేర్చినవాళ్ళలోనో
దందాలో ఉన్నందుకు జైల్లో కుమ్మి
జరిమానాలు దండుకున్న వాళ్ళలోనో
ఎక్కడో ఓ చోట కలుగుల్లోనో, పుట్టల్లోనో, గుహల్లోనో
నాన్నలుండే ఉంటారు
మర్యాదస్తులంతా వాళ్ళ నాన్నలకే పుడతార్ట!
మేం అమ్మ కడుపున పుడతాం
బడికెళ్ళి దోసెడు గుణకారాలు వల్లించాలంటే
నాన్నల్ని కొనాలి కిలో ఎంత?

నాన్నంటేనే చీకటి భూతాల గుంపయినచోట
నాన్నలంటేనే పుట్టని మా చెల్లెళ్ళకు కూడా

రోజువారీ కష్టమర్లయిన చోట
వండుకున్న అన్నాన్ని తన్నుకుపోయే గజ్జికుక్కల్ని తరిమినట్టు
కళ్ళనిండా తోడుకున్న మా నిద్రల్ని తన్నుకుపోయే నాన్నల్ని తరమలేక
ఏ జంతువు పేరెట్టి తిట్టుకుంటే
ఆ జంతువు సిగ్గుతో చిమిడిపోతున్న చోట
బడికెళ్ళి పిడికెడు గుణింతాలు దిద్దుకోవాలంటే
నాన్నలు దిగిరావాలి కిలో ఎంత?

కిటకిటలాడే మీ స్కూలు రిజిస్టరులో
రాముడనో, రహీమనో, కరుణామయుడనో
దేవుడి అవతారాలు తగిలించుకున్న తండ్రుల్లో
మా దగ్గర కొమ్ములూ కోరలూ విసిరే భూతం నవ్వుల నాన్నలెవరో
రాయగలిగితే రాసుకోండి
బతుకు నీడల్లాంటి నల్లటి బడిపలకల మీద
మా ఉమ్మితో తుడిచి పవిత్రం చేశాక
నరనరాల్లో విరిగిపోయిన విష రక్తబిందువు పేరు
నీచుడనో, మారీచుడనో, ఖడ్గమృగమనో, క్రిమికీటకమనో
అలవాటుగా ఆనవాయితీగా అక్షర దోషాల్లేకుండా రాసుకోండి

(మెహందీ స్త్రీలు పిల్లల్ని బళ్ళో చేర్చాలంటే అక్కడ తండ్రి పేర్లడుగుతున్నారని తెలిసి, నిరసనతో....)

*1.1.1996, ఇండియాటుడే*

## మీవాడు నైబర్స్ఎన్వీ కానంటున్నాడా!

కొట్టండిరా ఒరే
అమ్మలూ, నాన్నలూ, బూచుల్లాంటి బడిపంతుళ్లూ
ఎమ్సెట్, కేసెట్, లాసెట్, ఉరికట్ యుద్ధాలకు పంపి
విజయానికి చప్పట్లూ వీరమరణానికి చెంపదెబ్బలూ
రక్తాలు కారేట్టు కొట్టండి
మీ శిక్షణా చాతుర్యాన్ని కీర్తించుకోడం కోసం
తొంభైతొమ్మిది మందికి సీటివ్వడం మానేసి

వందో వాడికి పల్లకీ కట్టండి
పిల్లలు ర్యాంకుల్ని కంటూ, ర్యాంకులు పిల్లల్ని కంటూ
పిల్లల్నీ ర్యాంకుల్నీ ప్రిన్సిపాళ్లే కంటున్నంత ప్రసూతి కేకలు పెడుతూ
ఆ కేకలూ కేరింతలూ పత్రికలూ టీవీలూ కంటూ
భూమికంటే వేగంగా తిరుగుతూ
లక్షలారబోస్తున్న అక్షరాల వ్యాపార చక్రానికి
గాలితీసే ముళ్లని, సాదాసీదా అత్తెసరు మార్కుగాళ్లని
బళ్లన్నీ బతుకు తెరువిస్తాయనుకునే వెర్రిబాగుల కళ్లనీ
పలకలు పగలకొట్టుకుని పారిపోయేదాకా
తరిమికొట్టండి
మూడువందల అరవై అయిదు రోజుల పాటూ
ముక్కున పట్టిన పాఠాలన్నీ పరీక్షల మబ్బుముసిరేదాకా ఆపి
జిర్రుమంటూ పేపరుమీద మాత్రమే చీదగల నేర్పరికంటే
ముందే చీదేసిన వాడెంత అజ్ఞానో, దేశద్రోహో
తల ఖరీదు కట్టి
మీ తీరని కోర్కెల ఆక్రోశాలన్నీ ఎక్కుపెట్టి
డాక్టర్లూ ఇంజనీర్లూ కాకుండా
మనుషులెలా అయ్యారని విసిరికొట్టండి
అఖండమైన మీ మాతృత్వాలూ గురుత్వాలూ
పెట్టుబడి పెట్టినందుకు
చక్రవడ్డీ లెక్కన బంగారుగుడ్లు పొదగాల్సిన మేమంతా
బాల్యాన్ని అడిగినందుకు
పిండదశలోనే బ్రహ్మాండం బద్దలు కొట్టి నైబర్స్ ఎన్వీకానందుకు
ముల్లును ముల్లుతోనూ, వజ్రాన్ని వజ్రంతోనూ కోసిన నైపుణ్యంతోనే

ఒకడి గుండెను ఇంకోడి మెదడుతోనూ
ఒకడి సృజనను ఇంకోడి ధారణతోనూ
ఒకడి సర్వస్వాన్ని ఇంకోడి బాబు జేబుతోనూ కోతకోసి
తూకంలో తేడా వచ్చినందుకు ఛీ కొట్టండి
నేర్పని విద్యకి గురుదక్షిణగా
బొటనవేలు కోసిచ్చిన కోయవాడి కథ వినికూడా
మూడు పువ్వులకి ఆరుకాయలవడం చాతకాక
మందకొడి భయంతోనూ బాధతోనూ
వెన్నెముకలు విల్లులా వొంచి మీ ముందు నుంచున్నాం
ఆగ్రహం తీరేదాకా కొట్టండి
పందేనికి పెంచిన కోడిపుంజులకి మల్లే
పోషకుల విజయానికి గోడెక్కి అరవడం తప్ప
సొంతానికేం కావాలో చెప్పలేక
కలల్ని పెకిలించుకున్నంత చప్పున
మెడకి గుచ్చిన కత్తుల్ని తీసి గట్టున పెట్టలేక
పరస్పర ప్రత్యర్థుల్లా తప్ప ఏ వేదికమీదా కలుసుకోలేని మేము
కాకెంగిలి జామకాయల స్నేహపు రుచి
ఆశించినప్పుడల్లా చితక్కొట్టండి
జైలుకొక రంగు చప్పున సూట్లూ బూట్లూ తొడిగిన
గంగిరెద్దుల వేషంలోంచి
పారిపోవాలనే ఆలోచన వచ్చినప్పుడల్లా విరగ్గొట్టండి
కడుపులో నీళ్లు దాచుకున్న ఎడారి ఓడల్లా
భుజాలమీద వాలిపోతున్న మీ విజ్ఞాన పర్వతాల కింద
రాతికప్పల్లా బెకబెకలాడుతూ

లాలిపాటలూ గోరుముద్దలూ కమ్మటి నిద్రలూ
కావాలని బిక్కమొహం పెట్టినప్పుడల్లా దడిపించి కొట్టండి
సెలవులిచ్చినప్పుడైనా ఆడుకోడానికి లేకుండా
హోంవర్క్ భూతాలకి అందించి మేక్కొట్టండి
మా ఆటలేవీ జాతీయ క్రీడలు కానందుకు
మీ పర్మిషను లేకుండా మీసాలొచ్చినందుకు
మేం ప్రేమించిన పిల్లలు మీ కులమూ వర్గమూ కానందుకు
కట్టు తెంచుకుని పారిపోతామేమోనన్న భయంతో
ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసి జోకొట్టండి
మా జీవితపు రూలింగ్ నోట్సులనిండా
మార్క్‌పోస్టే తప్ప మార్జిన్ లేదని
మేం బట్టీయం వేస్తున్న మానవహక్కుల్లో
మాకు వర్తించేవేవీ లేవని తేల్చేసి ఇక కొట్టండి
కొట్టండిరా ఒరే
మముకన్న అమ్మలూ, బంగారు నాన్నలూ
ముంజేతి నరానికి గుచ్చిన
విజ్ఞానపుసూదుల్లాంటి బడిపంతుళ్లా
మీ ప్రేమ గానీ, కోపం గానీ, భయం గానీ,
భద్రత గానీ
ఏది ముదిరినా సరే
రక్తాలొచ్చేట్టు కొట్టండి
విజయానికి చప్పట్లూ
వీరమరణానికి చెంపదెబ్బలూ

*2.8.1997, గవాక్షం, ఆంధ్రప్రభ*

# పురుగులందున పుణ్యపురుగులు వేరయా......!

ఏమొ ఎవరు చెప్పగలరు!
చేదుతున్న బావి నీళ్ళలో
మగ చేపలు కదలాడే ఉంటాయి
ఉడుకుతున్న గింజల్లో సగమైనా
మగ చెమటకి నానే ఉంటాయి
చచ్చినప్పుడు కాల్చడానికి కప్పిన కట్టెలమీద
మగరెట్టలు కొన్నయినా ఉంటాయి
ఏమొ ఎవరు చెప్పగలరు
లేచిపోతానేమొ జార్జరోయ్, ఒరేయ్
ఈ దిక్కున మొలచిన పొద్దు
ఆ దిక్కున అస్తమించడమేమిటో
గడ్డిమీద కురిసిన వానకి
గండిపేట ఉరకలేమిటో
రేషన్‌కార్డు లెక్కన ఇంటికో ఇనపకచ్చడమిచ్చి
ఇల్లాలిని సత్కరించడమేమిటో
ఏమొ ఎవరు చెప్పగలరు
లేచిపోతానేమొ జార్జరోయ్, ఒరేయ్
లుక లుక లాడే నీ చూపులు కాస్తా
నా అడుగుజాడలు కొలవలేక కూలిపోతే
పూలకొమ్మకు నిప్పంటిస్తూ
పొగల ధాటికే నువు తూలిపోతే
కిటికీలు అడ్డగడియలు బిగించడంలో పడి

కాయక కాయక కాసిన తలకాయ కాస్తా
తలుపు సందులో నలుగుడు పడితే
ఏమో ఎవరు చెప్పగలరు
లేచిపోతానేమొ జార్తరోయ్, ఒరేయ్
పురుగులందున పుణ్యపురుగులు వేరయినంత ఖండితంగా
అరుగులందున నీ ఇంటి అరుగులు వేరని
అవి పంచనామాకి శిబిరాలనీ
శవమూ సాక్ష్యమూ
ఒకటే అయిన చోట
కార్యేషు దాసికి తెలుసు
శయనేషు రంభకి తెలుసు
శతకోటి శంకలను ప్రేమిస్తూ
చిత్రహింసలకు కన్నుగీటుతూ
పొద్దుపొడిచింది మొదలూ
నిద్ర ముదిరేదాకా
పాల మనిషితో, పేపరు మనిషితో
కూరల మనిషితో, కట్టెల మనిషితో
రోజువారీ లేచిపోవటాలకి బదులు
నరికితీసిన నీ తలతోనో, మొలతోనో
ఇరుకైన ఇంటి జైల్లోంచి
విశాలమైన అసలు జైల్లోకి
లేచిపోతానేమొ జార్తరోయ్, ఒరేయ్
ఏమో ఎవరు చెప్పగలరు!

*16.11.96, ఆదివారం అనుబంధం, ఆంధ్రజ్యోతి*



సుందరయ్య గ్రంథాలయ సంస్థ
ACC No. ....................
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500032.

## శబ్ద ప్రపంచం

ముఖానికొక రెండు గాజుగోడల చొప్పున
చూపులు చేసే దుర్మార్గాలేవీ నాకు తెలీదు
రంగు, రూపు, వంకర, వెలితి
అన్నీ నాకర్థం కాని మాటలే
తడిమి చూసినపుడు ఎవరిదైనా
ఒక రక్త చలనమే
మనిషింటే ఒక మాట
మనిషంటే ఒక స్పర్శ తప్ప

ఇంకే సమాచారమూ నాకు తెలిదు
నీ గొంతులో ప్రవహించే ఆర్ద్ర గీతాన్ని
నా చెవిలో వొంపుకోడం
నా చేతిలో ఉన్న హృదయాన్ని
నీ చెంపల కందివ్వడం తప్ప
నవ్వుతూ మాట్లాడి నొసలు చిట్లించడ మేమిటో
నాకిప్పటికీ తెలీదు.
మనిషితో అయినా గాలితో అయినా
తెరలేని సంభాషణ
నాలాంటి అంధుడొక్కడే చేస్తాడు
సంభాషణ పూర్తి కాకుండానే
మనుషులు జారుకున్నప్పుడు
ఖాళీ అయిన కుర్చీకి తగిలి గాయపడ్డ నామాటలు
గూడుదొరకని పిట్టల్లా రివ్వున తిరిగొస్తాయి
ఆశ్చర్యాన్ని దుఃఖాన్ని దగాపడినతనాన్ని
కళ్ళద్దాల వెనక దాచిఉంచడం కష్టమౌతుంది
అనుమతి లేకుండానే నా హావభావాల్నెవరో
ఫోటోతీసి చేతికిస్తారు
తడిమిచూస్తే వట్టికాగితం మాత్రమే
కంటికి మాత్రమే తోచే సౌందర్యప్రసక్తి కూడా
నాతో కొందరు చేస్తారు
నుదిటిమీంచి మునివేళ్ళు తాకుతూ పోతే
కళ్ళతాలుకు రెండు నిశ్శబ్దగోళాలు
ఆ మధ్యగా గట్టులాంటి బారెడు ముక్కు

శృతి లయల్లాంటి పెదవుల మధ్యగా నవ్వులాంటి చీలిక,
ఆ పిదప గడ్డం లాంటి నున్నటిమెట్టు
వెరసి నాలుగు నొక్కుల బ్రెయిలీ పదం నా మొహం
ఆరుమెట్లతో పదహారు భాషల వశీకరణ నా అహం
పదేళ్ళ తర్వాత కూడా గుర్తుపట్టగలిగే అరచేతిస్పర్శతో
కళ్ళులేనిది నాకు మాత్రమేనా!?
ఈ మాసపు పాటకోసం కమానుతో గుండె కోతపెట్టుకుని
నా ఎడమ భుజం మీద కునుకుతీసే
వయొలిన్ రాగానికీ కళ్ళు లేవు
పొద్దుముసిరితే అంతా శూన్యమై పోయే
మీ అలవాట్ల అంధత్వానికి నవ్వుకుంటూ
శూన్యంలో ఆత్మదీపాన్ని వెలిగించుకుంటూ నడుస్తాను
నా చుట్టూ కలలు వినిపిస్తాయి
కలల్ని ఒరుసుకుంటూ కదలుతున్నచక్రాలు వినిపిస్తాయి
అడుగుల చప్పుడు అంతదూరాన ఉండగానే
వళ్ళంతా చెవులు చేసుకున్న మా అక్కల ఎదురుచూపు వినిపిస్తుంది
పగలంతా పాడుకున్న స్వరసంగీతాల నిండా
కిటకిటలాడిన వసంతాలూ మధుమాసాలూ
ఏ రంగులో ఉంటాయో అర్థంకాక
తడుముకుంటూ తడుముకుంటూ కలల పాడుగునా
విలవిల్లాడే మా ముగ్గురి గాజుకళ్ళ చప్పుడు
త్రీడీలో వినిపిస్తున్నప్పుడు
నిశ్శబ్దం కోసం కూడా అలమటిస్తాను
పక్షులూ మనుషులూ వాహనాలూ రొద పెట్టడం మొదలవగానే

అది వేకువ అనుకుంటాం
రొద ఆగిపోగానే రాత్రయిందనుకుంటాం
మనుషులు చేసినంత మోసం
చెవులు మమ్మల్నెప్పుడూ చెయ్యలేదు
నుంచున్న పళంగా మనుషుల్ని కొనుగోలు చేసే
చూపులెలా ఉంటాయో నాకు తెలీదు
విశాఖ ఇసకలో పాదం మోపగానే
సముద్రం గలగల్లాడుతుంది
చార్మినార్ పొగబండి కిటికీలోంచి
గండిపేట గాలివీస్తుంది
గాలి నీళ్ళ కంటే ఆత్మీయమైన స్పర్శ మరోటిలేదు
చూపుల చీకటి తెలీని
మా అడుగుజాడల మీద
అదేపనిగా కురిసే పిరికి మాటల బురదకు
తడిసిపోకుండా గమ్యం చేరడమే ఒక యుద్ధం
గని కార్మికుడు నల్లవజ్రం కోసం
పట్టిపట్టి అడుగేసినట్టు
రహదారి రోడ్లమీద
ఒక శబ్దం కోసం ఒక స్పర్శకోసం
ఒక ఊపిరి పరిమళం కోసం
పెనుగులాడుతూ నడుస్తాం

(వేణుగోపాల్‌కి ప్రేమతో...)

*8.11.1998, గవాక్షం, ఆంధ్రప్రభ*

## అలలెప్పుడూ తీరం మీదనే...

ప్రేమంటే మజాగానే వుంటుంది నీకు
ప్రతిదశలోనూ యుద్ధమే జీవితమౌతుంది నాకు
యుద్ధాలెప్పుడూ రాజ్యాధిపత్యం కోసమే కాదు
ఉనికి కోసం ఊపిరి కోసం కూడా జరుగుతాయి

ఊపిరి పీల్చినంత సహజంగా నిన్ను ప్రేమించాలని
నేనో కల కంటాను
మెలకువకు ముందు రెప్పల వెనక పొంచివున్న
చిట్టచివ్వరి ఘట్టం లాంటి కల
కలలైనా అలలైనా తీరం మీదనే
అలిసి పోతాయెందుకో అది అర్థంకాదు
నీ ముఖాన్ని అరచేతుల్లోకి తీసుకుని
నుదుటిమీద చిన్న ముద్దు ఇవ్వాలనుకుంటాననుకో
శంకాకులమై కన్నెర్ర జేస్తున్న లోకంతో యుద్ధం చేయాలి
సబబో కాదో కొట్టుకుంటున్న నా గుండెతో యుద్ధం చేయాలి
క్షణక్షణానికి ఎరుపెక్కుతూ క్రీనీడలు తళుకులీనే
నీకళ్ళతో యుద్ధం చేయాలి
ఒక్క క్షణం కోసం ఎన్ని వందల యుద్ధాలు
ఒక్క యుద్ధం కోసం అన్ని వేలవీర మరణాలు
ఇంతకూ నేనసలు పతితనో పతివ్రతనో తేలక
నలుగురితో బాటు బెంగెట్టుకుంటావు చూడు
అదిగో అప్పుడేమో
ఒక తపోభంగాన్ని తట్టుకుంటూ నుంచోవడం యుద్ధమౌతుంది
గేలాన్ని కొరికి రక్తారుణిమలు నవ్వే చేపలు
సామంతరాజులవుతాయి.

*1996,* అముద్రితం

# చావుడప్పు

సూదులు వికటిస్తాయి డాక్టరు బాబూ
అందుకు మీ పూచీకత్తు లేదు
కత్తుల బోనులో తలవంచాల్సింది ఎప్పుడైనా మేమే
మీ రాయి మీరు వేశారు
మా మనిషి మాకు దక్కలేదు
తప్పంటూ ఉంటే అది మా తలరాతదే తప్ప మరోటి కాదు
ఉప్పుచాలని కూరని చట్టితో సహా
విసిరికొట్టినంత చులాగ్గా

ఎప్పుడో ఓనాడు ఈ మొగుడు నన్నీలోకానికి విసిరికొట్టి
ఎటు పారిపోతాడోనని భయపడ్డాను
బాధల బండలు మోసిమోసి
ఆ బండల కిందే చితికి పోతాననుకున్నాను
కడుపున కాసిన ఆకలిగడ్డలకి
అడుక్కుతినే వయసొచ్చినా చాలనుకున్నాను
అనుకోకూడనివన్నీ అనుకుంటూనే ఉన్నాను బాబూ
అయినా ఈ దారుణం మరి తట్టుకోలేకుండా ఉన్నాను
గాలివాటు బతుకులు కదా
గాలి పోటెక్కినప్పుడల్లా
నా ఇంటి నడికప్పు కొట్టుకుపోతూనే ఉంది
ఇప్పుడు మావాడికి మీరిచ్చిన సూదిమందు సాక్షిగా
గాలందక మరోసారి కొట్టుకుపోయింది
ముక్కున పట్టిన గాలిగొట్టం
బిల్లు కట్టమని బుసకొడుతోంది

సూదులు వికటిస్తాయి డాక్టరు బాబూ
అందుకు మీ పూచీకత్తు లేదు
గుండెలున్నది కోత మిషను కిందికి నెట్టడానికి
కుట్లు వేయించుకోడానికి తప్ప
అరిచి గోల చెయ్యడానికే ఆస్పత్రి ఒప్పుకోదని
మెత్తమెత్తగా మీరు కసిరినప్పుడు
పొంగిన కన్నీళ్ళ ను రాళ్ళు చేసి మింగేశాను
నీళ్లు రాళ్లయి కురిసిన ప్రతి ఉప్పెనలోనూ

నా కాపురం కూలిపోతూనే ఉంది
ఇప్పుడు మావాడికి మీరిచ్చిన సూదిమందు సాక్షిగా
నీరందక మరోసారి కూలిపోయింది
నాడికి దిగని సెలేన్ బొట్టు
బిల్లు కట్టమని బుసకొడుతోంది
పుస్తెలమ్మి పస్తులుండీ కాపుకాసిన ప్రాణదీపం
పగబట్టి నట్టు పొగ చూరిపోతుంటే
రోజువారీ సంజె పొద్దులా
వార్డుకి వార్డే దిక్కులు చూస్తుంటే
ఆపలేని శోకంతోనూ,
చావుడప్పులా మోగుతున్న గుండెతోనూ
అంటుకున్న అడవిలా మీ దగ్గరకొచ్చి
అరిచానో అలమటించానో అదేపనిగా మీ పనులు చెడగొడుతూ
పిలిచి పిలిచి విసిగించానో
దేశంలో ఏ మూల నిప్పంటుకున్నా
మొదట నా సంసారం రోడ్డున పడుతూనే ఉంది
ఇప్పుడు మావాడికి మీరిచ్చిన సూదిమందు సాక్షిగా
వేడందక మరోసారి రోడ్డున పడింది

కుమ్మరి సారెలా గిరగిర తిరుగుతున్న
రూపాయి కుదురుమీద చిల్లికానీ లేకుండా
బతకడమే కాదు ... చావడమైనా తప్పేనని తెలుసుకున్నాను
కాసులు మోగితేకాని బతకడానికి ఆయువు పొయ్యక
కాసులు మోగితే గాని పోయిన వాడి శవాన్నివ్వక

కాసులు మోగితేగాని కడుపారా ఏడవనివ్వక
నకనకలాడే నలుగురు పిల్లలతో కలిసి
చెట్టంత మనిషిని మన్ను చేసేదెప్పుడాని
పంచభూతాల్లా మీ కాళ్ల ముందు కూచున్నాం

మీసూదులు మాకు వికటించడమేమిటి బాబూ
మేమే మీ ఆస్పత్రులకు వికటించి ఉన్నవాళ్లం
మీ సూదులకు చేతులిచ్చి
మీ కత్తులకు గుండెలిచ్చి
మీ ఆపరేషన్ క్యాంపులకోసం కడుపులిచ్చి
మీ అమ్మకాలకు కళ్లనీ మూత్రపిండాల్నీ యిచ్చి
మీ రవాణాకు రక్తమిచ్చి
మీ చదువుల కోసం మా శవాలనిచ్చి
ఇచ్చేందుకింకేమీ మిగలని వాళ్లం బాబూ
ఈ లోకంలో చిటికెడు గాలిని కూడా
బేరం చెయ్యలేని వాళ్లం
దయగల ప్రభువులు తమరే మాకు
తలకో విషపు సూదీ ఇప్పిస్తే
చప్పుడు చేయకుండా పోయిన మావాడ్ని చేరుకుంటాం
కప్పిన దుప్పటి కింద, కమ్మిన చీకటి కింద
మగ్గుతున్న నా మొగుడిశవం కంటే
అదేపనిగా సబ్బెట్టి తోముకున్న
మీ చేతులే ఎక్కువ కంపు కొడుతున్నాయి

*3.3.1996, గవాక్షం, ఆంధ్రప్ర*

భాష...

సాటి మనిషిని భూపతనం చెయ్యడానికి
ఆది మానవుడి పెదవుల మీద విషకీటకంలా వాలింది
కీటకాల రొదల మధ్య మాటిమాటికీ తప్పిపోతున్నదీ
తరుముకుంటూ తిరుగుతున్నదీ నేనే
భాషకే కనక స్నేహవారధి కట్టడం చాతనయితే
నన్నింత దివాలా కోరుని చేస్తుందా?
భావజాలంతో విషజలమే లేకపోతే
నన్నింత బలిపశువుగా మారుస్తుందా?
తుఫాన్ల కంటే భూకంపాలకంటే
కొన్ని పదాలే నన్నెక్కువగా భయపెడతాయి
రెప్పలు కప్పుకుని దాచుకున్న పగటి కలలమీద కూడా
పదాల వత్తిడి అనుభవాని కొస్తూనే వుంటుంది
పదాలు తప్పిన అఖాతాల్లో శీలమనే పదం ఎన్నోది?
శీలమంటే ఏమిటనే ప్రశ్న నోట్లోంచి బైటికి రాకుండానే
నా నాలుకెవరో కత్తిరించారు
నిన్న శీలం లేనితనం
నా చెల్లికి ఒక కులాన్నిచ్చి వెలివేసింది
మొన్న శీలం నిరూపణ కోసం జరిగిన దహనం

నా అక్కను నామరూపాల్లేకుండా చేసింది
ఇవాళ శీలానికి సంబంధించిన చర్చ
నా పౌరసత్వాన్నే అవమానించింది
శీలం చుట్టూ అల్లిన క్రూర భావనల మధ్య
దిక్కులేని ప్రేతంగా మిగులు తున్నది నాశరీరమే
నుంచున్న పళంగా చెరవడుతున్న లోకంలో
పనికోసం ప్రయాణం కోసం గుంపులోకి వెళ్ళినప్రతిసారీ
చర్మాన్ని కోత పెట్టుకుంటూ కుబుసాలు విడుస్తూ
విసవిసా పుట్టలోకి పారిపోతున్న దినచర్యల మధ్య
ప్రేక్షక నేత్రంలా మిగులుతున్నది నా ఆత్మ మాత్రమే
ఎవరూ పేచీ పడలేని పొంతానికొక పూచీలేని
లజ్జా రాహిత్యాల మధ్య
చావులేని ఇంటినుంచి ఆవాలు తెమ్మన్న గౌతముడిలా
శీలప్రసక్తి లేని నాలుగు వాక్యాల కోసం
మానవజాతి చరిత్ర సర్వస్వాన్ని తవ్వుతున్నాను
వుండలేక పారిపోక లైబ్రరీ బీరువాల్లో
కొట్టుకుంటున్న కావ్యాలమీద
బొద్దింకలూ, చెదపురుగులూ చేసిన ఛిద్రాల కంటే
శీల నిరూపణ ఘట్టాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి
విత్తుకున్నది మొదలు బూడిదయ్యేవరకు
పత్తిచెట్లు ప్రసవించి యిచ్చిన వస్త్రాలెటుపోతున్నాయో
శీలమనే గారడి పదం ముందు
నాతల్లుల్లో సగం మంది వివస్త్రలై పోతున్నారు

*5.10.1995, అముద్రితం*

# ఊపిరాడ్డం లేదు

ఎంత పండగ పొద్దయినా
ఇండియాలో పగలు పన్నెండింటికి నిద్ర లేచే నా తమ్ముడు
ఉగాది పచ్చడి కోసం డెట్రాయిట్ నగరమంతా
తప్పి బోర్లించాడ్ట!
పొరుగింటి పుల్లకూర రుచే మరి
స్కూలుకెళ్ళే వయసులో కోకోకోలా నీళ్ళే

మల్టీనేషనల్ ముద్దు

వాడ కడుపు నిండా ప్రవహించేవి
మార్క్యురీ ఐసులా ధగధగలాడే విదేశీ ఉప్పుతో
ఉజ్జాయింపు తెలీక విసుక్కుంటూనే
అమ్మ ఉలవచారు కాస్తోంది
చారు కెరటాల్లో సత్యాగ్రహం చేసిన వాళ్ళంతా
కొట్టుకుపోతున్నారు
లేబుల్స్ విప్పకుండానే మరో దేశం వస్తువులు
చేతులు మార్చే
ఏజెన్సీ ఉద్యోగి మా పెద్ద మామయ్య వాగ్దాటికి
స్వదేశీ ఆత్మ బహిష్కరణ జరుగుతూ వుంటుంది.
వలస పోవడం కంటే భావప్రాప్తి సిద్ధించే కల యింకోటి తెలీని
పక్కింటి పారిజాతం ఇంపోర్టెడ్ పెళ్ళికొడుక్కోసం
ఎదురు చూస్తోంది
చిన్నప్పుడు తమ్ముడికీ నాకూ ఉమ్మడి ఆస్తిగా
ప్రపంచ పటం ఒకటి గోడకి వేలాడేసి వుండేది
నిట్టనిలువుగా నుంచున్న సముద్రాలు రోజాల తరబడి
ఎడారుల్లోకి వొలికిపోయినా
ఒకే సారవంతమైన నేల ఎందుకు పుట్టదో
తరగని ఆలోచన నాకు
అప్పట్లో కూడికలంటేనే యిష్టం మరి!
వాడి దారి వేరు వాడిదంతా తీసివేతల పరిజ్ఞానం
ఎంత చిన్న నదినైనా గట్టుకొక పేరు చప్పున విభజించాలనే
సమాచారం వాడే ముందు నాకు యిచ్చాడు
తమ్ముడు ఇంటికి వస్తున్నట్టు కబురందితే చాలు

బిల్ క్లింటనో వాడి తాతో కరుణించినంత
భయ సంబరాలు మా కళ్ళలో
కట్టుడు చీరలు కొనడానికి నసిగే నాన్న
లక్షలాది రూపాయలతో ఇంటికి ముస్తాబు చేయించాడు
మందులాడో ఇంద్రజాలికుడో వచ్చినంత
సంభ్రమంగా బంధుమిత్రులు చుట్టూ మూగుతారు
ఏ సంచీ లోంచి ఏ అద్భుతం బైటికి తీస్తాడోనని
నరాలు తెగిపోయేంత ఉత్కంఠ!
గెడ్డం బ్లేళ్ళు, సెంటు బాటిళ్ళు, వాకీటాకీలు
ఒహ్! ఒకటేమిటి? ఇల్లొక స్మగ్లింగ్ కేంద్రంగా మారుతుంది
జారిపోతున్న పాము కుబుసాల్లాంటి చీరల్తోనూ, లుంగీల్తోనూ
బొక్క బోర్లా పడుతూ
మానాన్ని రక్షించుకోవడం గొప్ప సర్కస్‌లా వుంది
ఎవర్ని చూసినా పొట్లాలు విప్పుతున్న చప్పుడే
అంటుకున్న కుటీర పరిశ్రమల తాలూకు నిట్టాడ పాకల్లా
ఒకటే చిటపటలు
ఎన్నాళ్ళుంటాడో ఎప్పుడెగిరి పోతాడో తెలీక
అడిగేందుకు ఇంటర్వ్యూ దొరక్క
ముత్యాల గర్భం వచ్చినంత సందిగ్ధం మా అమ్మకి
ప్రేమనే పాకం పట్టి డబ్బాలకెత్తిన
అరిసెల్ని, సున్నుండల్ని, పూత రేకుల్ని తినేసి
గాలీ నీళ్ళూ మనుషులూ వికటిస్తున్నారని
మా డాక్టరు దగ్గర కంప్లయింట్ చేస్తాడు
తమ్ముడిదెప్పుడూ ఇన్నోవేటివ్ బ్రెయిన్ కదా

బాల్యానికి చిహ్నం లాంటి విశాలమైన ఇంటిని కూల్చి
అపార్ట్‌మెంట్ల కివ్వాలని ఆలోచన చేస్తాడు
తమ్ముడి దెప్పుడూ ఎమోషనల్ బ్రెయిన్ కదా
'ఐ మిస్స్‌డ్ యూ' అంటూ నాలుగేళ్ళ కోసారి కావిలించుకుని
మేం నిజమనుకునే లోగా ఎగిరిపోతాడు
తమ్ముడి దెప్పుడూ డాక్యుమెంటింగ్ బ్రెయిన్ కదా
నాన్న అంత్యక్రియల్ని క్యాసెట్ తీసి పంపనందుకు
అలిగి మాట్లాడ్డం మానేశాడు
వాడికంటే పది గంటల ముందు సూర్యోదయాన్ని చూడగల
ఒక భౌగోళిక అద్భుతం వున్న నేను
ఎక్కడో ఎందుకో వెనకబడి పోయాను
దేశాల మధ్య శత్రు వ్యూహాల్ని
శవాలు లెక్క తేలుస్తాయి
దేశాల మధ్య వ్యాపార సంబంధాలు
అంకెల్తో సహ దొరుకుతాయి
అక్కా తమ్ముళ్ళ మధ్య ఇప్పుడు రక్త సంబంధం ఒక వలస
రాగసంబంధం ఒకవెట్టి
మనుషులందరూ విండోస్‌లో కిటకిటలాడ్డం మూలానో ఏ మో
రోడ్ల మీద బరువు లేదు
ముడతలు పడ్డ నా చిన్నప్పటి ప్రపంచ పటంలా
దేశాలకు దేశాలే దగ్గరకు నొక్కుకు పోయాయి
ఆక్సిజన్ లోపమో యింకేమి లోపమో
...ఎవ్వరికీ ఊపిరాడ్డం లేదు.

*18.6.2000, ఆంధ్రజ్యోతి, కవిత్వంతో ఒక సాయంకాలం.*

# మీడియా

మీడియా ఇంకా ఆడాళ్ళు అడుగుపెట్టకూడని
అయ్యప్ప కొండలానే వుంది
తల మాసిన వాళ్ళతో కిటకిట లాడే
క్షుర కర్మశాలలా వుంది
స్వేచ్ఛా స్వతంత్రాలకు గుర్తుగా
మూత్రంతో తడిసిన రాజధాని గోడలా వుంది
కాయ్ రాజా కాయ్ సంస్కృతిలో
కాకిలా తిరగ్గలగడం
ప్రేతాత్మలకి అందకుండా పాతనవలలు
కాపీ కొట్టడం
బూతు సినిమా రీళ్ళకీ, చవకబారు సీరియళ్ళకీ
నంగిరి వ్యాఖ్యానాలు, నకిలీ ఉత్తరాలు
రాయడం కనీసార్హతగా వుంది
ప్రతిభకీ పనికీ పొంతన లేనిచోట
పనిపోయి పరువు మిగులుతుందో
పరువుతో బాటు పనీ చేజారుతుందో
అర్థంకాని రుద్ధ స్వరంలా వుంది
అవమానాలే అనుభవాలైన చోట
అనుభవజ్ఞులు కావాలంటూ ఎక్కడ ప్రకటన వచ్చినా
అసమానజ్ఞులే గుమిగూడి
అంతా అనుకున్న ప్రకారమే జరుగుతుంది
కుందేళ్ళను చంపి నక్కలకు పెట్టినా

సీనియర్లను చంపి జూనియర్లకి వడ్డించినా
చెదురు మదురు సంఘటనలు మినహా
అంతా ప్రశాంతంగానే వుంది
కాయ్ రాజా కాయ్ సంప్రదాయంలో
చూస్తే లేదు చంపితే వుంది
చంపడాన్ని చావడాన్ని వార్తగా తప్ప చూడలేని
సంపాతక వృత్తిలో
సర్వఅవయవాలకు స్పర్శ జ్ఞానం పోయింది
కత్తి కంటే కలం గొప్పదనుకునే నా చిన్నప్పటికల
వెర్రి గొర్రిలా సంతలోన తూగుతోంది
మర్డర్లకీ అత్యాచారాలకీ
మసాలా దట్టించడం ఇవాళ జర్నలిస్టుపని
ఏ పార్టీ గొడుగు కింద నుంచుంటే
ఆ గొడుగుకున్న చిల్లుల్నే
నక్షత్రాలుగా చూపడం ఒక ప్రతిభ
ఏ వాస్తవాన్నెలా తొక్కిపట్టాలో
ఏ వదంతినెలా అమ్ముకోవాలో
ఆడ పేరెట్టుకున్న మగరాతలకీ
మగలు నిర్వహించే ఆడపేజీలకీ
క్రాపులూ కొప్పులూ సవరించడం నా పరిమితి
పనంటే ఆత్మగౌరవ ప్రకటన అనుకునే వాళ్ళని
పనికోసం కలవరించే వాళ్ళని
పనికి మాలిన వాళ్ళుగా చిత్రించే వంచనా శిల్పం
కొనసాగుతూనే వుంది

కొండేపూడి నిర్మల

చచ్చిన వాళ్ళ సంఖ్యని వార్తల్లో తగ్గించి చెప్పినట్టు
బరిలో బతికున్నవాళ్ళని మాట్లాడనివ్వకపోవడం
అలవాటుగా వుంది
లక్ష్మణరేఖల సరిహద్దుల్లోనూ
అర్ధాంతరపు పార్టవుట్ కుట్రల్లోనూ
ఆడవాళ్ళే ఎందుకు హిట్‌లిస్ట్‌లో వుంటారో
అర్థం కాకుండా వుంది
వ్యాపారంలో ముసుగులేదు
వ్యభిచారంలో మోసం లేదు
ఒక జాతికి ద్రోహం చేస్తూ
నీ నోట్లోంచి వూడిపడే సాహిత్యం కంటే
సంస్కృతికంటే జర్నలిజం కంటే
మోసకారి మాట ఈ ప్రపంచంలోనే లేదు
Your Services are terminated
with immediate effect
చెప్పుకోలేక దాచుకోలేక గుప్తరోగంగా
సలపరించే ఈ మాట
లగ్గం నాటి రాత్రి అమ్మానాన్నా ఏడుస్తూ అంటారు
అహంకారం అతిశయిస్తే కట్టకున్నవాడు క్రూరంగా అంటాడు
ముసలిదాన్నయ్యాక కన్నపిల్లలు స్వార్థంతో అంటారు
అబ్బొంక చుట్టానివీ అమ్మొంక చుట్టానివీ కాకపోయినా
ఇవాళ D.I.G మూర్ఛబిళ్ళ చూపించి
నువ్వు అదేఅన్నావు
అసలు ఏరంగంలో నా సర్వీసు క్రెడిట్ అవుతుందో

అర్థంకాక నేనేడుస్తుంటే,
పదికళ్ళతో పది వ్యాపారాలెలా చేస్తున్నావో
మాయా అద్దంలో చూడాలని వుంది.
వానర వేషం వీడకముందే
గ్లోబలైజేషన్ జీర్ణించుకున్న వాడా
ఉన్న పళాన ఉద్యోగాలు గాలికెగిరి పోతున్నాయి
గోల్డెన్ షేక్ హాండ్‌లో చేతులు తెగిపడుతున్నాయి
నిద్రతీసి లేచే లోపు
అవయవాలు అంగడి కెడుతున్నాయి
పని వూడినప్పుడల్లా వినయ రాహిత్యపు రబ్బరు స్టాంపు ముద్ర
ఫెయిర్ సెక్స్ చితిమీద
బొందితో సహా తగల బెడుతుంది
కూచున్న కుర్చీ గాడిదలా సకిలించి
నాలుక్కాళ్ళతోనూ నడ్డిమీద తన్నినట్టనిపిస్తుంది
కొలువునుంచి కొలువు కోసం ఎన్ని మైళ్ళు నడిచినా
భూమి గుండ్రంగా వుందనే అమ్మ అమ్మమ్మల దుఃఖం
నిస్సహాయంగా కళ్ళలో కొచ్చిపడుతుంది.
మీడియా ఇంకా ఆడాళ్ళు అడుగుపెట్టకూడని
అయ్యప్ప కొండలానే వుంది
కొలతలు తీసి చూద్దామా అంటే
అది నా మోకాలికి యిటో అటో
నడుచుకుపోవడం ఒక్కటే
అనివార్యంగా వుంది.

*7.12.1999,* అముద్రితం.

# రిగ్గింగ్

గుద్దుకోండి మహాజనులారా
ఎవరి ఓట్లు వారే
ఎవరి బల్లలు వారే
A great undermocretic feature
formed in literary field
అప్రజాస్వామ్యం వర్థిల్లుగాక

అంతర్జాతీయ కంప్యూటర్ తెరలనిండా
అఖిలాంధ్ర అరాచక కవుల దురదలు
గుద్దుకున్న వారికి గుద్దుకున్నంత మహదేవా
సందర్భాలు పూడ్చిపెట్టండి
ఉద్యమాలు హైజాక్ చెయ్యండి
జవాబుదారీ తనానికి నిప్పెట్టడం కోసం
మందికి దూరంగా వుండండి
ఇంత మంది సంఘర్షణ వేదన సృజన
ఆది మధ్యాంతమూ తమరేనంటూ
పౌరాణిక సినిమా చివర
గొట్టాం వూదిన సిండికేటు కృష్ణుడి మాదిరి
మా వలువల్ని మీ విలువల్లాగా ఎగరేసుకుపొండి
విరేచనాన్ని బట్టి బిడ్డ రోగానికి
విడుదల చేసిన దాన్ని బట్టి కవిగారి జలుబుకి
ఎక్కడెక్కడి మబ్బులా మట్టిగడ్డలూ కారణమవుతున్నాయో
విదేశీ ద్రోణుల సాహిత్య మెనూ కార్డులోకి
జోలపాటలూ, గోడమీద పిడచకట్టిన గొబ్బిళ్ళ పాటలూ
అందగించేందుకు స్వదేశీ బొటనవేళ్ళ ఖండన
ఎన్నాళ్ళుగా జరుగుతోందో
తమరు రిగ్గింగులు చేసుకున్న కొద్దీ
చరిత్ర వునరావృతమౌతోంది
పీటాధిపత్యాలూ, గండ పెండారాలూ
రాజహారానికి తలవొంచిన ఆస్థాన నర్తకి నవ్వులూ

కళ్ళ ముందు గిరగిరా తిరుగుతున్నాయి
గోడలమధ్య సమాధయిన అనార్కలులకీ
వాడల మధ్య పరాజితులైన అలీసమ్మలకీ
సాహిత్యం బంపర్‌డ్రా బహుమతి కాదు
చుంచుర లాడే సృజనాత్మక గాయం
మనవ జన్మెత్తిన ప్రతివాడూ సిగ్గుతో
దూకడానికి బావులు వెతుక్కోవాల్సిన గేయం
డాలర్స్ కోసమో డబుల్ స్టాండర్డ్స్ కోసమోకాక
తలక్రిందులయిన జీవితాన్ని నిటారుగా నడవడంకోసం
వాళ్ళు రాస్తున్నారు
వ్యక్తిగత సంధి ప్రేమ జ్వర పత్రాలు కాదు
బాహాటంగా చేతులు కలిపి నడవాల్సిన
చారిత్రక సమయంలో వున్నాం
కళాత్మక చల్ది లారగించడానికిది
మధురా నగరి కాదు
కడవల కింద కదుములుకట్టిన గొల్లపిల్ల తల
తందానా చెప్పదు
అర్ధాంతర ఎన్నికల్లాగా, అకాల రుతు ఘోషలాగా
అవాంఛనీయ సత్కారాలొచ్చినప్పుడల్లా
గుద్దుకున్న ఓట్లతో అక్కడి బ్యాలెట్ పెట్టెలకి
కడుపుబ్బి పోయి దారి విడువు మంటూ ఏడుస్తాయి.

(ఇరవయ్యేళ్ళ స్త్రీ వాద సాహిత్యం అంశంగా తానా సభలో ఓ తెలుగు కవయిత్రి చదివిన సిద్ధాంత వ్యాసం చూసి

*8.1.2000,* అముద్రిత

# మేల్ వార్డు నెం-2

ఆరుపడకల వార్డు కొచ్చిన కలియుగ సావిత్రీ!
ఓ క్షతగాత్రీ!
పతిప్రాణము తప్ప ఏదయినా కోరమంటూ
యముడేమని గర్జించాడో
గుక్కపట్టి విన్నావా?
గుటకైనా వేశావా?

కాకులు కరిచే కారడవుల్లో
చీమలు దూకే చిట్టడవుల్లో
తట్టకెత్తుకున్న నీ అల్పాయుష్కుడు వినకుండా
తూరుపు దిక్కును శపించావా?
తలారి మౌనం పాటించావా?
గుండె కొక గండి చొప్పున
గ్లూకోజ్ నీళ్ళయినా కాలేని
పతివ్రతల కన్నీళ్ళనుంచి
నీ కన్నీళ్ళను విడదీసుకున్నావా?
రాళ్ళను గుగ్గిళ్ళు చేశావా?
స్ట్రెచర్ కొక యింటిదీపం
భయాత్పాతమై పొగ బెడుతుంటే
నిలవలేక కూచోలేక
తలాపున ఐ.వి.సూదికి కన్ను గుచ్చుతూ
కాళ్ళదిక్కున ఇల్లాళ్ళు
కారుచౌక ప్రియురాళ్ళు
ఒకరి దుఃఖానికి
మరొకరు గుభిల్లు మంటూ
ఒకరి ధైర్యానికి
మరొకరు గుండెదిటవు చేసుకుంటూ
రోగుల్నీ రోగకారక క్రిముల్నీ అల్లుకుంటూ
మేల్ వార్డు నిండా

ఫిమేల్ రోదనలే
రుసరుస లాడే మొహాలు కడిగీ
ఈటెలు విసిరే నాల్కలు గీసీ
ప్రాణనాథుడి అల్ప బుద్ధి లాంటి
యిరుకిరుకు ఆస్పత్రి కూపాల్లో
వాంతులకీ మూత్రపు సంచులకి
మధ్యన తలవాల్చి కలగంటే
ఉమ్మితొట్టెలో శ్లేష్మ రక్తమే
సూర్యోదయమై పొంగిందా
కేసుషీటులో డేంజరు మార్కులు
కలవరింతలుగ  మారాయా
ఒక్కడి కోసం
లోకాన్ని వదులుకున్న నీకు
ఆ ఒక్కడి ఉనికిలో దాగిన
విశ్వవ్యాపక శూన్యాన్ని గమనించావా?
ఆరుపడకల వార్డుకొచ్చిన కలియుగ సావిత్రీ
ఓ క్షతగాత్రీ
నీళ్ళ కోసం, పాలకోసం, మందుకోసం
మనస్తాపం దించుకోడం కోసం
కారిడార్‌లోకి వచ్చినప్పుడల్లా
భూతదంతాల్లా మెరిసే మార్చురీ అక్షరాలు
పగబట్టినట్టే వెంటాడతాయి.

*17.12.95,* అముద్రితం

# శుష్క విలాపం

నెనొక దిక్కుమాలిన పత్రిక కడనిల్చి
చిహాలున రాయి తీసి చేయి విసిరిన ఘడియలోన
ఈతిబాధలు తలపున దూసుకొచ్చి
మాకొక దారి చూపవే అనుచు
బావురుమనగ దరఖాస్తు పెడితి
నా మానసమందెదో చివుకుమన్నది
సాహితీ ప్రభల శోభ మెదిలి
ఏమయ్యా నేను మీకు ఏమి అపకారం చేశాను?
బూతును గౌరవించితి హింసకు  బాక్సుకట్టి
తమాశ్రయించు పాఠకులకు రంగుల బూది రాసి
మిముబోంట్ల వ్యాపారమునలబ్ధి కూర్తుము
అస్వతంత్రుర మమ్ముల స్వార్థ బుద్ధితో
కొలువును కూల్చి పోతివి

మల్టీనేషనల్ ముద్దు

కారణమైన లేక పోతివే..ఏ..
సహనము చావని నాల్గు దినముల్
చెంచాల కీర్తనకు చర్చ నడిపి
తదీయ కరమ్ముల లోన
గజ్జి తామర మెచ్చి చేతులిచ్చి
ఆయువు తీరినంతనే
చివాలున రాలిపోదుము మాదగు దినవార్తకు చోటు లేక
కరువు భత్యాన మతిలేని కోర్కె పూన్చి
గుండె లోపలి ఓరిమి తవ్వితీసి
మురిసిపోతిమి ముచ్చట చితులు మరచి
అకటా...
పాపాల భైరవుడ పేపరోడ!
మా వాడిచేరు ముగ్ధ సుకుమార పాల బుగ్గల నింట తాళమేసి
మీకై కృశించి నశించి తలపండిపోతి
మా సర్వీసునెల్ల కొల్లగొని
ఆపై తాఖీదు పత్రమిచ్చి
పొమ్మనుచు పొడబెడితివి కదా
రాత గాడికి మెతుకు వున్నదే
సర్కారు గడ్డి మేసి మొలిచినావు
సహజమగు మేత నీకేల చాలదోయి
పిల్ల పాపల పస్తులుంచిన పాతకుండా
మైల పడిపోయెనోయి నా జర్నలిజము.

(పుష్పవిలాపం రాసిన కరుణశ్రీకి,గానం చేసిన ఘంటసాలకి క్షమాపణలతో

*15.4.1994* , అముద్రిత

# పాడికళ్ళ వ్యాధి

ఒరే తమ్మా!
చావుకి దొరికినన్ని కారణాలు
బతికేందుకు అందకపోవచ్చు
అయినా తప్పదురా
అర్థం ఆకారం లేని అమీబా వ్యవస్థకి
తల ఎక్కడుందో వెతికేందుకైనా
మనం బతికి తీరాలి

మల్టీనేషనల్ ముద్దు

మంత్రించిన గుహలాంటి కంప్యూటర్ని
పొగలు కక్కే సీసా భూతం లాంటి కెమిస్ట్రీని కాకుండా
చరిత్రనీ, రాజకీయార్థిక, సామాజిక శాస్త్రాన్నీ
చదవాలనుకున్నపుడే
నువ్వు మందలోంచి వేరయ్యావు
మార్కెట్ లేని, మూసలో ఒదగని మనిషి ప్రయాణమంటే
అంత తేలికనుకున్నావా?
సోషల్ సైన్సెస్ అంటే వైరస్‌కో ఫంగస్‌కో తగులుకుని
లేచిపోయే సమాచార చిట్టా కాదని
అప్లికేషన్ అందుకునే అయ్యావారితో చెప్పు
బేతాళ శవం లాంటి ప్రశ్నార్థకాన్ని బుజాల మీద మోస్తున్న
విక్రమార్కుడివి కదా!
ఎనభై శాతం మందికి వర్తించే 'జస్ట్ ఏవరేజ్ 'రబ్బరు స్టాంపు ముద్ర
వెక్కిరిస్తోందంటే ఎలా?
నీ ముఖంలో వెట్టికళ లేనందుకు
నీ చేతిలో విమానం రెక్క మొలవనందుకు
నీ సర్టిఫికెటవీ జాతీయక్రీడలు కానందుకు
కాలేజీలెప్పుడైనా కావలించుకుంటాయిట్రా!
అవి చేసేదే అసలుకి చక్రవడ్డీ విస్తరణ పథకం కదా!
ర్యాంకుల గాళ్ళ నుంచి మామూలు వాళ్ళను విడదీసి వెలివేసే
చిత్రహింసలో అయినా నీకా రహస్యం బోధపడలేదా!
రాతిలో కప్పల్లాంటి నీ క్లాసు పిల్లలకింక
పాఠాలెవరూ చెప్పరు
పంతుళ్ళంతా వలలు భుజానవేసుకుని రోడ్డున పడ్డారు

నిన్న మధ్యాహ్నానికి ఏడు చేపలు దొరికాయట!
ఎండలో కూచుని ఎంట్రెన్సు రాస్తున్నది వాళ్ళే
మరుగుజ్జులౌతున్న నీడల్ని తోలుకుంటూ
అమ్మానాన్నల ఎదురుచూపు గేటుకవతల తెర్లిపోతోంది
మెడకి కట్టిన కత్తులు ఖణేల్మంటూ
ఒకర్నొకరు తొక్కుకుని పిల్లలు పరిగెడుతున్నారు
నీళ్ళ వ్యాపారంలో నేల వ్యాపారంలో
పంచభూతాల్ని పంట కరుచుకుని గురువులు పరిగెడుతున్నారు.
అసాంఘికం అమానవీయం తప్ప
విద్యార్థికి కాలేజీ ప్రాంగణంలో ఇంకేమీ అందడంలేదు
ఇలాంటప్పుడు ఇక్కడ బతకమనడమే
ఒక హింసోన్మాదమవుతుంది
అయినా మనం యింత పిరిగ్గా
మూతలేని డ్రెయినేజీలా, తూకానికి పెట్టిన పరీక్ష పేపర్ల కట్టలా
జీవితాన్ని చేజారి పోనివ్వకూడదు
మదర్ టంగ్‌లో మాట్లాడినందుకు
బట్టలిప్పి బెంచీమీద నిలబెట్టిన
మీ ఎంగిలీష్ సార్ కూడా చచ్చిపోతాడు
చావుకీ పుట్టుకకీ మధ్య బతుకంతా వలసకట్టడం నేరం
కూలిన విలువల పావురం యిప్పుడు
నీలాంటి సిద్ధార్థుడి వాడికోసమే ఎదురుచూస్తోంది
బతకాలి తమ్మీ
నువు బతికే తీరాలి

*12.11.2000 , ఆదివారం అనుబంధం, ఆంధ్రజ్యోతి*

# నాన్నలెప్పుడూ ఇంతేనమ్మా

నాన్నలెప్పుడూ ఇంతేనమ్మా
అకస్మాత్తుగానే....
అసలేమీ పంచుకోకుండానే...
ఆచూకీ అయినా చెప్పకుండానే...
నీ సేవలకి సవాలక్ష వంకలు పెడుతూ
బైట ప్రపంచం కోసం బండెక్కి పోయినట్టుగానే
ఇప్పుడూ...
బూటుకాలితో తన్ని వదిలిన గేటు కివతల
ఇదే ఏకాకితనం ఇదే చావు దిగులు

సాంద్రతలోనే తప్ప సారంలో తేడా ఏముంది చెప్పు
నిట్టూర్చే నీ పక్కన నిప్పులు మింగిన అయిదు పిల్లులు...
తండ్రి బీభత్సానికీ తల్లి బేలతనానికీ
సాక్షీభూతాలై దిండును కరుచుకున్న బల్లులు..
నాటుకున్న ప్రతి కన్నీటి బొట్టూ ఊడలు దిగి
కల్లోకి పాడుచుకొస్తే మెలకువలోకి పారిపోయిన పిల్లలు..
పంచ పాండవుల మీద అప్పుడు నువు కట్టిన జోలపాటలో
మొదటి నలుగురూ పరాయి కర్ణులే
మనిషికొక కొయ్య దుంగ కట్టి
ఎవరి సముద్రంలో వారిని వదిలాక
నిజవారసుడు కొడుకేనట కదమ్మా
పలుపు దెబ్బలు కాచుకోలేక పోతే ఎలా!
పాలబాకీలకీ పచారీపద్దులకీ లెక్క తప్పిపోయి
చివాట్లు తిన్నదానివి కాబట్టే
అరవయ్యేళ్ళ సాహచర్యపు కోతలో
గాయాల కూడిక తెలీక
గుండె తెగేలా మా నాన్నను పట్టుకుని పిలిచావు
బతికివున్న రోజుల్లో ఎప్పుడేనా నీ పిలుపుకి బదులొచ్చిందా?
పక్క వీధికైనా షికారు పిలవని మనిషితో
స్వర్గానికెలా వెడతావమ్మా
స్వర్గం నిండా పుణ్యాత్ముల కిటకిటేనట
దగాకోరుతనాలకీ దాపెట్టిన వేదనలకీ
తలుపులూ అడ్డ గడియాలూ వుంటాయో లేదో
ప్రాణభయం కంటే పరువు బరువుతో

మునక వేసిన దానిని కదా
నువ్వక్కడ వుండలేవు
వుం...డ...లే...వు
ఎంత పండగ పొద్దయినా
'నీ పిండాకూడు' తోనే తెల్లారే మనింట్లో
నాన్న ఆకలి కాకులు తప్ప యింకెవరు తీరుస్తారమ్మా
కన్న సంతానంలో కూడా
విజయాలు తనకిచ్చి వైఫల్యాలు నీవనుకున్నావుకదా
చరమాంకంలో కురిసిన క్షీణ బింబపు వెన్నెల ప్రేమ
నీ స్వీట్ సిక్స్టీన్ నీకిచ్చిందా?
మర్చిపోకమ్మాఏదీ మర్చిపోకు
యుద్ధ ఖైదీల్ని గజదొంగల్ని అవమానించే తీరులో
కన్యాశుల్కం నాటి బుచ్చెమ్మ వేషానికి నిన్ను దింపి
సంప్రదాయబద్ధంగా తమ దహన సంస్కారాల్ని చాటుకున్న
బంధుమిత్రుల శత్రు స్పర్శనీ
నుదిటిమీద ఆనవాలుగా మిగిలిపోయిన
కుంకుమ భూతం కోరనీ
పేటెంట్హక్కు పోగొట్టుకున్న పసుపు భూతం కొమ్మనీ
ఎప్పటికీ మర్చిపోకు
మరపు తాత్కాలిక విశ్రాంతేకాదు విషనిద్ర కూడ
నీ కడుపులో ప్రతి అవమానం డాక్యుమెంట్ కావాలి
తెల్ల చీర ఇక ఎవరు కట్టినా శూన్యాకాశం కాదు
అది అన్ని రంగులూ యిమడ్చుకున్న న్యూటన్ వర్ణ చక్రం

*11.10.1998 ఆదివారం అనుబంధం, ఆంధ్రజ్యోతి*

# తల్లిపాల వారోత్సవం

స్విచ్చివేస్తే బల్బునుంచి కాంతి ఉరికినట్టు
స్తనాల నుంచి పాలు ఉరకలేవు
ఒక్క పాలబొట్టుకి పది కన్నీటబొట్లు మూల్యమిస్తూ
ఆ తల్లి మెలికలు తిరిగిన నల్లత్రాచు రోడ్డు మీదుగా
పనిలోకి నడుస్తుంది
మాతృత్వ మధురిమల గురించి
ఇక మీరెన్నయినా చెప్పుకోవచ్చు
పురుటినొప్పి తీరకముందే పాలనొప్పి ప్రారంభమై
మనిషికి మనిషే ఆహారమైన చిత్రాన్ని
మనసింకా జీర్ణించుకోకముందే
దడికట్టిన చూపులబారు చలిచీమలై పాకుతుంటే
గుండెను గాలికొదిలి
మెదడుకి ప్రేక్షకపాత్ర మప్పడం
ఎన్నికిలోల రసాత్మక ఘట్టమవుతుందో
ఇక మీ తూనికరాళ్ళతో కొలుచుకోవచ్చు
పాలిచ్చే తల్లులకు ఏ దేశంలో అయినా
ఎప్పుడూ దొరకనిది దోసెడు ఏకాంతమే అయిన చోట

మంది మధ్య కక్కటిల్లుతున్న బిడ్డకు
రైకముడి విప్పి ఆకలి తీర్చేలోపు
చచ్చి బతికి పోయినంత నిరీక్షణ
తన్మయానందమెలా అవుతుందో
ఇక తప్పొప్పుల చిట్టా బరువున తూచుకోవచ్చు.
బాలింత కష్టాలు బాలారిష్టాలూ ఏవీ
అఘాయిత్యాలకు మినహాయింపు కాని చోట
రాజ్యహింసలో రగిలిపోయిన
గోండు స్త్రీ గుండెల సాక్షిగా
స్త్రీలు దేవతలని చెబుతున్న వాడెవడో
ఒక్కసారి యిటు పిలవండి
అన్నపూర్ణ కొలువుండే స్వర్ణమయ దేశంలో
పాలిచ్చే తల్లులకు ఎప్పుడూ దొరకనిది
పిడికెడు అన్నమే అయినచోట
డబ్బాపాలకు నిరసన వాక్యమని పొగడబడే నా తల్లి
ఒక్క పొద్దు బువ్వతో బండెద్దు చాకిరితో
అమ్మతనమొక నిస్సహాయమైన శాపమై
ఎంతకూ చేపుకురాని స్తనాల్లాంటి దిగులుకళ్ళతో
ఒక్క పాలబొట్టుకోసం పది కన్నీటిబొట్లు మూల్యమిస్తూ
తల్లిపాల వారోత్సవాల శిబిరంలో
ఆఖరివరసలో కూచుని వుంది
కెమేరాకు బొమ్మలు పోగుచేసుకుంటున్నవాడెవరో
ఒక్కసారి యిటు పిలవండి

*మే 99, భూమిక.*

# హోమ్‌సిక్

ఊరి మీద బెంగ కాదు
ఊరు జబ్బు పడిందనే బెంగ
దగ్గరవుతున్న బెజవాడ కొండల్ని చూస్తుంటే
ఎత్తుకొమ్మని చేతులందివ్వాలనిపించే బాల్యచాపల్యం
దాని గుండెల్లో ఎన్ని డైనమేట్లు పేలాయో
ఇప్పుడక్కడ కొండలూ లేవు
కొండగుర్తు లాంటి నా బాల్యమూలేదు
జంక్షన్ దగ్గర మలుపు తిరిగితే
తుదీ మొదలూ ఒకేసారి కనిపించే
రైలుబండి కిటికీ లోంచి చూపులు పరిగెత్తినంతమేరా
ఆ నేల నాదనే అనుకుంటాను
కలల మీద కాంప్లెక్సులూ సారీ సెంటర్లూ మొలిచి వుంటాయి
కనకదుర్గ ముక్కుపుడక ముంచిపోతానని
శపథం చేసిన కృష్ణవేణి ఆగ్రహం
లంకవాసుల్ని ముంచెత్తడం లేదు
కబ్జాదెబ్బకు వలసపోయి ఎవరి కన్నీళ్ళలో

వారు కూలిపోతున్నారు
పాయిలో నిప్పురాజేస్తే పాకలంటుకు పోతాయని
దడుసుకునే గుభేల్ పేట గుండెలు
ఫ్యాక్షన్ తగాదాలకు గాలి మోస్తున్నాయి
నీటిచుక్క కోసం ఆర్చిప్పల్లా ఎదురుచూసే
ముత్యాలం పేట బిందెలు
తెరమీద వానపాటలో కొట్టుకుపోతున్నాయి
వేళ్ళన్నీ మెదళ్ళు నరుక్కుని ఎటుపారిపోయాయొ..
ఐలవ్యూ అని రాసే వాళ్ళులేక
ఎ.కె.టి.పి హైస్కూలు గోడలు తెల్లబోతున్నాయి
రంగు దట్టించిన గూండా విగ్రహాల పక్కన
గాంధీ బొమ్మ నీరసపడిపోతోంది
మొగలి పొత్తులు ఘుమ ఘుమలాడే కాళేశ్వరరావు మార్కెట్లో
తెగిన తలకాయలు తూగుతున్నాయి
ఊరుమీద బెంగ కాదు
ఊరు జబ్బు పడిందనే బెంగ
రూపమూ సారమూ విడదీసి చూపిస్తోంది
పుట్టిపెరిగిన ఇల్లు పుట్టిల్లనే అనుకున్నా
తమ్ముడికి అద్దెయిచ్చి అక్క వుంటోందక్కడ
గ్రూప్‌ఫోటోలో నవ్వుతున్న అమ్మానాన్నలకి తప్ప
అందరి రక్తాల్లోనూ కిరాయిభాషే నడుస్తోంది
కొడుకు అద్దెయిల్లు సొంతమనుకోలేక
కూతురు అద్దెయిల్లు పరాయిదనుకోలేక
శాశ్వత తాత్కాలిక యాజమాన్యాల రాపిడిలో

నలిగిపోతూ అమ్మ
బంధువులా ఎప్పుడేనా తను గడిపిన ఇంటికి వస్తుంది
తలుపులు తెరిచి గోడలు తడిమి
నలభయ్యేళ్ళ కాపురం తాలుకు దుఃఖ పారవశ్యంతో
నూతిలోకి చాద వేస్తుంది
పంపు లొచ్చాక దాని మొహం చూసిన వాళ్ళు లేరు
నిలవగా నాచుగా నాలుగు బొక్కెన్లు పారబోశాక
కొబ్బరి నీళ్ళ లాంటి జల
నూతిలో గొంతుకలాంటి తన బాల్యయవ్వన వార్థక్యాల్ని
అదేపనిగా తోడి పోసుకుంటుంది
మెళ్ళో దండను విసిరికొట్టి ఫోటోలో నాన్న కసురుతాడు
"ఏమిటా నీళ్ళు పారబొయ్యడం
ఎడారిలో వదిలి పెట్టి వస్తాను జాగ్రత్త"
"ఆహా అలాగా నేనున్నది ఇప్పుడు అక్కడే కదా
మీతో కాపురం సరోవరంలా ఏమీ లేదు లెండి"
అప్రయత్నంగా అమ్మ జవాబు చెప్పుకుంటుంది
రూపమూ సారమూ రెండుకళ్ళలోంచి పొంగుకొస్తుంటే
సూట్కేసు పట్టుకుని నిశ్శబ్దంగా నుంచుండి పోతాను
"ఎప్పుడొచ్చావే అమ్మలూ!"
నీళ్ళ బరువుకో గుండె చెరువు కో
జ్ఞాపకాల్లోంచి యివతలికొస్తూ అమ్మ
అమ్మ వచ్చినప్పుడే అది నా పుట్టిల్లు
వలస తేదీలు కలుపుకుని బండెక్కుతాను ఎప్పుడూ

*3.1.1996 అముద్రితం.*

మల్టీనేషనల్ ముద్దు

# ఇతడేనటే 'స్నేహితుడే' నటే...!

కాలేజీ నుంచి కాఫీ హౌసుకి
రాజమార్గమే ఉంటుంది
అయినా నేనెందుకో కొమ్మలు వొరిగిన మామిడిచెట్టెక్కినట్టు
మాటిమాటికీ పట్టు తప్పిపోతూ
ఫర్లాంగు దూరాన్ని పరిపరివిధాల శంకిస్తూ నడుస్తాను
దారి పొడుగునా చూపులు పారాడతాయి
పోన్లే పాపం చీమలే కదా అని దులిపేసుకుంటాను
పార్కుముందు నల్లద్దాలు సకిలిస్తాయి
పోన్లేపాపం గాడిదలే కదా అని సర్దుకుంటాను
అమ్మకానికి కూచున్న బఠాణీలవాడు
కొనడానికొచ్చినట్టు నవ్వుతాడు
పోన్లే పాపం బఠాణీలే కదా అని సరిపెట్టుకుంటాను
నిజంగా నువు ముచ్చటించబోయే
రాజ్యహింస పాఠం కోసం
పర్యావరణ హింసనంతా భరించేస్తాను
చీకటి చిక్కనవుతున్న కొద్దీ
కార్నరులో ప్రేమజంటలు వేడెక్కుతాయి

'ఓన్లీలవ్వర్స్' కోసం ఉన్నన్ని పార్కులూ క్యాంటీన్లూ
స్నేహానికెందుకుండవో...
బేరాలు రాయబారాలూ కళ్ళముందే జరిగిపోతాయి
గాలి చేదెక్కడం మనకర్థమవుతుంది
చూస్తున్న దృశ్యాల్ని చూడనట్టనిపించేలా
చూపుల్ని నిలిపివుంచడం కష్టమౌతుంది
చేదులో ఉన్న సహజత్వాన్ని గురించి
ఫిలాసఫీ కూడా ఒకటి అల్లుతావు
వికృతమవుతున్న స్వరకంపనలతో నేనేదో వాదిస్తాను
క్రమక్రమంగా నీ మొహంలో కాలుష్యమేఘం కమ్ముకుంటుంది
నవ్వినప్పుడు, ఏడ్చినప్పుడు, బతికినప్పుడు, చచ్చినప్పుడు
నేనెంత అందందంగా వున్నానో వృథా ప్రసంగం చేస్తావు
బావుండటం తప్ప ఇంకే ప్రయోజనం లేని
నా భావ ప్రకటనలన్నీ ప్రేతకళ వీస్తాయి
ముక్తాయింపు కోసం నువు 'ప్లేటోనిక్‌లవ్' కూడా
మన మధ్యకు తెస్తావు
చీమలూ గాడిదలూ బఠాణీలూ ధ్వనించిన దానికంటే
భిన్నమైనదో ఏదో చెప్పబోతున్నావనే ఆశతో
'గ్లాస్ విత్ కేర్' కంటే ఏకాగ్రతగా నిన్ను వింటాను
ఏం కావాలని అడగడానికొచ్చిన క్లీనరు కమ్ బేరరు కుర్రాడికి
నువ్విట్టే అర్థమైపోతావు
'ప్లేట్ ఆఫ్ లవ్ డబుల్ రోస్ట్' ఆర్డరిచ్చి
ఇంకో కార్నరుకి వెళ్ళి పోతాడు.

*3.9.1999 గవాక్షం, ఆంధ్రప్రభ*

# లేడీస్ ఫింగర్స్

ఎలాగైతేనేం
ఎన్ని గోళాలు తలక్రిందులయితేనేం
సగం సగం తెగిన మనమంతా
ఒక అర్థవంతమైన వాక్యంగా అల్లుకుపోయాం కదా
గడ్డ కట్టడానికే పుట్టిన అలల్ని
చురకలేసి పరుగులెత్తించాం కదా!
దయాభిక్ష వేడుకునే పాత్రల నుంచీ
కంటికీ ప్రపంచానికీ మధ్య తెరలు కడుతున్న
సంసార తాపత్రయాల నుంచీ

కలుసుకున్న మన చేతుల మీద కసితీరా కుడుతున్న
వాచీ ముల్లుకి భయపడ్డం మానేసేందుకే
బోలెడంత రిహార్సలు కావాల్సి వచ్చింది
నాటకం ఆడకముందు డైలాగ్సే వుంటాయి
వట్టి డై-లాగ్స్!
ఇప్పుడిక్కడ మనమున్నాం
ఎల్లలు లేని పౌరుషాన్ని ప్రామ్టరు లేకుండా
పలికించాల్సిన మనం
డైలాగుని ముక్కున కరుచుకునే దాకా
రెక్కలవసరం తెలీని మనం
సరాసరి వేదిక మీదికొచ్చేశాం
సభాకంపాల కంటే జీవితాలే
ఎక్కువ భయపెడతాయనే నిజం
మరోసారి వల్లెవేసినట్టయింది
భూకంపాలూ మరో ప్రపంచ యుద్ధాలూ కూడా
మనల్ని బెదరగొట్టలేవు
పగలు చాలు రాత్రి చాలు
వంట వేళ దాటిందనే స్పృహ చాలు
తుప్పుపట్టిన కత్తి మీద కసకసా తెగుతున్న
ఉత్సాహపు వేళ్ళతో మగ్గుతున్న
లే..డీ..స్..ఫిం...గ...ర్స్!
భూగోళంలో ఎక్కడికెళ్ళినా
పొయ్యిమీద టైం అడుగంటిన వాసనే
వెంటాడుతున్న చోట

పాత్రధారులంతా ఒకే చీకట్లో
మొహానికంటిన సంతోషపు రంగును
కడిగేసుకుంటారు
నల్లా విప్పిన వేళ్ళకు అందకుండానే
సంచలనం నీలివాలుకి కొట్టుకుపోతుంది
చెట్టు నుంచి చివరి ఆశ రాల్చుకున్న నిట్టూర్పు
పాములా పెదాల మీదకి పాక్కుంటూ వస్తుంది
గూళ్ళలో దాక్కొన్న కనుగుడ్లు రెండూ
భీతిల్లినట్టే కదుల్తాయి
మేకప్ చెదిరిన ముఖం మీద ఎడారిని దాటలేక
కన్నీటి చుక్క గాయపడుతుంది
వేదిక దిగి నడవబోతే
గూనితనం గుమస్తాతనం గుర్తింపులేని ఇల్లాలితనం
కాచుకున్న వాస్తవంలా కళ్ళ ముందు
గిర్రున తిరుగుతుంది
మప్పిన రాణీవేషం నుంచి
మనసింకా తీరకుండానే
గాలికి బదులు దైనందిన శోకం వీస్తుంది
ప్రపంచం మాలిన్యాల మయమై పోయిందనే
డైలాగు బాధ నేనింక అభినయించనక్కర్లేదు
మాటకీ మనసుకీ మధ్య మట్టిపలక పేరుకుంటోంది

(ఒలానాటిక 'వాళ్ళు ఆరుగురు' లో చలం నాయిక రాజేశ్వరిగా వేషం కట్టిన స్ఫూర్తితో)

*17.12.95, గవాక్షం, ఆంధ్రప్రభ*

# విడాకులు

ఆకురాలు కాలం
కొత్త చివుళ్ళకి చోటిస్తుంది
విడాకులు రాలు కాలం
ఎన్ని అవమానాలకు చోటిస్తుంది?
గాంధారి దుఃఖాన్ని గుర్తుకు తెచ్చే
న్యాయదేవత సాక్షిగా
నోరులేని మోడు కాలధర్మానికి తలవొంచి
ఆకురాల్చినంత దయగానైనా
ఈ కోర్టులు విడాకులు రాల్చలేవు
అయినవాళ్ళ అసహనాలూ కానివాళ్ళ ప్రశ్నార్థకాలూ దారిబత్తెంగా
టౌను బస్సెక్కిన ప్రతిసారీ
నన్నో నా స్వాభిమానాన్నో
పోలేరమ్మకి బలిస్తున్నట్టనిపించి
ఏడుపింకిన తేటకళ్ళతో
ఫిర్యాదీ గైర్హాజరు కాకూడదని
కోర్టుకి సెలవలుండకూడదని
క్యూలో మంది వుండకూడదని
కిటికీ పక్క ముళ్ళ పొదలకు మొక్కుకుంటాను
ఇల్లు - వల్లకాడు

మొగుడూ- యముడు
పెళ్ళి - పెటాకులు
పర్యాయ పదాలన్నింటా వికృతార్థాలే
జీవిత వాస్తవాలౌతున్న చోట
బతికే హక్కును కించపరచే మాటల ఊబి
కన్సీలియేషన్
కన్సీలియేషన్ నా గుండెను చావుడప్పులా మోగిస్తుంది
అత్యాచారం చేసిన వాడికి ఆత్మను కూడా వప్పజెబుతుంది
కిరసనాయిలు చల్లిన వాడికి నిప్పంటించే సమయాన్నిస్తుంది
కన్సీలియేషన్ పేరు విన్నప్పుడల్లా
నాకు పకపకా నవ్వొస్తుంది
విల విలా ఏడుపు కూడా వస్తుంది
చెవులు మోతెక్కించే పెళ్ళి సన్నాయిని
దానికున్న అపశృతులన్నింటి తోనూ
పోషించే సమాజమూ చట్టమూ
నాకివ్వాల్సిన నష్టపరిహారానికి పూచీ పడవు
అక్షతలు చల్లిన పెద్దలూ
ఆత్మకింపగు కబుర్లూ
వేద మంత్రాలూ
ఏవీ నా ఆర్తనాదాన్ని పట్టించుకోవు
పతివ్రతల కన్నీళ్ళనుంచి
పౌరహక్కుల్ని విడదీసుకోడానికే
వున్న శక్తంతా ఖర్చయిపోతున్నచోట
న్యాయం కోసం కొంగు చాపినప్పుడల్లా

ఒక నీతి వాక్యం
మొగుడొదిలేశాడనే నిందతో
అమ్మదూకిన చెరువునిండా నీతి వాక్యాలే
మొగుడ్నొదిలేసిందనే నిందతో
అక్క తాగిన విషం నిండా నీతి వాక్యాలే
మనిషి శవమౌతున్న చోటల్లా
పోస్టుమార్టం రిపోర్టుకింద బుసకొడుతున్నది నీతి వాక్యమే
కుటుంబాల్ని కాపు కాసే పెద్దలారా
భూత గృహాలకు తోరణాలు కడుతున్న ప్రగతి కాముకులారా
వున్న హక్కుల్ని కాలరాసే మీడియా మాంత్రికులారా
ఇంట్లో వాళ్ళు కిరసనాయిలు చల్లినప్పుడల్లా కోర్టుకీ
కోర్టులూ పోలీసులూ నీతివాక్యాలు చల్లినప్పుడల్లా ఇంటికి
వెళ్ళలేక నాలుగుదిక్కుల నక్కలరోడ్డు మీద నిలబడి
జీవితానికి పర్యాయ పదంగా జీవితేచ్ఛను అడుక్కుంటున్నాను
అడుక్కోవడం నాకివాళ కొత్త కాదు
తమ్ముడితో సమానంగా కూరవడ్డించమని అడుక్కున్నాను
ఎదుగుతున్నంతమేరా మనిషిలా చూడమని అడుక్కున్నాను
కడుపున కాస్తున్న ఆడశిశువును కననివ్వమని అడుక్కున్నాను
అడుక్కోడమే ఈదేశపు అన్నపూర్ణ హక్కుగా
ఈ కళ్ళతో ఆబల్లమీదున్న గ్లోబు వంక చూస్తుంటే
ఆరు ఖండాల ఎడారుల పక్కనే
నవ నవ లాడే నదులన్నీ
చేతికందని పొట్టి పెన్సిలుగీతల్లా కనిపిస్తున్నాయి.

*6.8.1995* అముద్రితం.

## నా బాధకి వాచకం లేదు

మానమంటేనే పరువూ మర్యాదా కదా!
మానాన్ని కప్పెట్టుకోవడమే నా చావు బతుకుల సమస్య కదా!
మానాన్ని కోల్పోడమంటే చీమూ నెత్తురూ గడ్డకట్టిన క్షణం కదా!
నాగరికత నా మొలకి బట్టకట్టిన చేత్తోనే

నీ నోటికి తిట్టు వొదిలి వుండాలి నాయినా
లేకపోతే ఇంత పెనుగులాట వుంటుందా?
తిట్టు ఉచ్చున బిగిసి తపతపా కొట్టుకుంటున్న
వెర్రిపిట్ట గింజులాట వుంటుందా
ముప్పై రెండు కోరలు గురిపెట్టిన నీ నోటి గుహలోంచి
పంజా విసిరిన ప్రతి తిట్టూ నా పుటకని తేలిక చేసి ధ్వనిస్తుంటే
కండ కావరంతో తిట్టిందెవరో
కడుపు మంటతో అయువు పట్టుమీద కొట్టిందెవరో
పుట్టి మునిగిన దాన్ని తంర్డ్రీ
గట్టునున్న వాడి చిక్కుముడి విప్పే జవాబేముంటుంది చెప్పు
అరుపు లేకుండా అనవాలు లేకుండా ముఖాలు చెక్కేయ్యడంతో
నీ శిల్పం నీకుందని కొనియాడ్డం తప్ప -
దండాలు బాబూ
'నీయక్క...లం..డ..క్క..త్త..ల్లీ..గా...మ్మా...ధూ'
అని కాంర్డించినపుడల్లా
అగ్రవర్ణం నీ మెడకి వేలాడదీసిన ఉమ్మికుండ కంటే
ముందు పగిలేది నా గుండేనని తెలవదా సామీ
నడ్డికి కట్టిన చీరనీ, నెత్తికి చుట్టిన కొప్పునీ, ఓ కొంత సొంత కోపాన్నీ
అభినయించినంత మాత్రాన
నా గాయాన్ని నువ్వు వేషం కట్టలేవురా ఓరయ్యా
తిట్టు నీ ఆగ్రహానికి అనివార్య ప్రకటన అయిన చోట
మానం నాకు అవమాన ప్రతీక అవుతుంది బాంచెన్
అంగాలు మారనంత వరకూ ఏ ఇంటి ఇల్లాలికైనా
ఆత్మకథల సారమొక్కటే దారా,

కాకపోతే కొంచెం ప్రకటన తేడా
ఏ ఇద్దరి పుంలింగాల కైనా ఆడదాని విషయంలో
ఆంగికాలూ వాచికాలూ ఒకటే
కాకపోతే కొంచెం వేదిక తేడా
దొర కొలువులో దొర్లిన కన్నీటిని దొంగచాటుగా వొత్తుకుంటూ
ఏరోజు పోగొట్టుకున్న సిగ్గూ శరమూ
అరోజే నొల్లుకుని వొంటికి చుట్టుకునే లోపే
తడికట్టెల మీద పొగలా ఊరంతా గుప్పుమంటున్న భయం
వెట్టిలో వున్నా పరువు భయం
నా కడుపులో కవ్వం తిప్పుతూ వుంటుంది బిడ్డా!
ఎదురు తిరిగాననొ ఎవరినో మరిగాననో
పీకల దాకా తాగొచ్చి
ప్రాణం పోయేదాకా కుళ్ళబొడుస్తున్నప్పుడు కూడా
మొదట పాతిపెట్టాలనుకునేది ఈ పాపిష్టి వొళ్ళుని కాదు
జనాల కళ్ళని, కాల్మొక్త!
కోడి కూతతో బాటే గోడెక్కిన ప్రతి బూతు మాటా
తుప్పు పట్టిన మేకులా నడిచినంత మేరా సలపరిస్తుంది బాబులారా
సలపరపు పాలు తాగిన నా బిడ్డ కూడా
అమ్మా  అనడానికి నోరు తెరిచి 'నీ యమ్మా'అంటుంటే
రెండు చెవుల బండరాళ్ళ మధ్య
నలిగి నజ్జవుతున్న నాతల ముంజెకాయలా రాలి పోతుందిరా అయ్యా!
నాకిప్పుడు తలకాయలేని తనమే కాదు
పేగులు తెగిపడే ఆక్రోశానికి కూడా
గొంతు పెగలని అవిటితనం

ఏమాటని ముట్టుకుందామన్నా
అంతక్రితమే నీచపరిచి గాలి కెగరేసిన నా అవయవాలే
చూపుకి తోస్తున్న చోట భాషేలేని తనం
అన్నింటికంటె ఎక్కువ దగా చేస్తోంది. ధరమ పెబువులారా!
పోరాటాలూ ఉప్పెనలూ వలస చదువులూ వచ్చి కూడా
మీ కుట్రనీ కబుర్లలో వున్న కలేజానీ మాకు నేర్పలేదు బాంచెన్
నగరాల్లో యింతుల నాజూకు కన్నీళ్ళను
అక్కడి భూబకాసురులే దొరక బుచ్చుకుంటారు
గాలికీ తమకీ తేమ తగ్గినప్పుడల్లా
పద్యాల్లో చల్లుకుంటారు యాదిలేదా బిడ్డా!
తులాభారంకట్టినపుడు ఏ స్త్రీలింగమేనా
గడ్డిపోచతో సమానంగానే తూగుతుంది నీమీదొట్టు
చర్మాలు మొద్దుబారినంత మాత్రాన
చెవులకి మూతలెవరూ కనిపెట్టలేదు అన్నలారా
అశ్లీలమే నీ ఆయుధమైన చోట
ఆ చెవినుంచి ఈ చెవికి దబ్బనం గుచ్చి
గాలిపల్లకి పూసలా మెదడుని ఊరేగించ  దలచిన చోట
ముమ్మాటికీ ఈ దగుల్బాజీ నాగరికత నా మొలకి చుట్టింది బట్ట కాదు
అనుదినం అవమానంతో కంపిస్తూ
గాయానికి తగులుకుని వేలాడే గాజుగుడ్డ అయి వుంటుంది

(ఆగస్ట్ 15 1995 ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో అచ్చయిన ఎండ్లూరి సుధాకర్ 'ఐదోవాచకం' చదివి)

*15.10.1995*, ఆదివారం అనుబంధం, ఆంధ్రజ్యోతి

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
ACC No.. ... .
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500032.

MULTINATIONAL MUDDU

) POETRY (



పసుపూ గంధం పన్నీటి మడుగుల్లో దూకిన
వెనకటి తరం శారీరక స్పృహకంటే
అందాల వ్యాపారం కోసం అందవిహీనమవుతున్న
వ్యవస్థకి బానిసగా
ఈ సామాజిక స్పృహే నన్నెక్కువ దగాచేస్తోంది

• • •

దేశాల మధ్య శత్రువ్యూహాల్ని
శవాలు లెక్క తేలుస్తాయి
దేశాల మధ్య వ్యాపార సంబంధాలు
అంకెల్తో సహా దొరుకుతాయి
అక్కా తమ్ముళ్ళ మధ్య
ఇప్పుడు రక్త సంబంధం ఒక వలస
రాగసంబంధం ఒక వెట్టి

• • •

పంటెవరు దోచుకున్నా సరే
బీడు వదలని రైతొక గాడిద
ఫలమెవరి పేరిట చెలామణీ అవుతున్నా సరే
పురిటి నొప్పి తీస్తున్న తల్లొక గాడిద
పదమెవరు దోచుకున్న సరే
పాటమానని గాయకుడొక గాడిద
గాడిద కన్నీళ్లమీద పరిశోధన జరక్కపోవచ్చు
వెనక కాళ్ళ వడ్డింపులుంటాయని రుజువులున్నాయి.

KONDEPUDI NIRMALA